# అనుభవం..!

కాలం ఎవరికోసం ఆగదు..
ప్రతి అనుభవం ఎక్కడో ఒకచోట
ఉపయోగపడుతుంది ...
ఎందుకంటే ఏ అనుభవం సులువుగా రాదు...
అనుభవిస్తే తప్ప...!



నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 28 సంచిక : 60 మంగళవారం, నవంబర్ 25, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## నేడు అయోధ్యలో ప్రధాని
# మోడీ పర్యటన

రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ



**అయోధ్య,నవంబర్ 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటించను న్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నా రు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై మిగతా2లో...

## ప్రధాన న్యాయమూర్తిగా
# జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

● ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ● హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు



**న్యూఢిల్లీ,నవంబర్ 24:** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం నాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు.మిగతా2లో...



## బాలీవుడ్ దిగ్గజ నటుడు
# ధర్మేంద్ర మృతి

- కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స

**ముంబై,నవంబర్ 24:** భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసు కున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మిగతా2లో...

## అన్ని రంగాల్లో పిల్లలు
# రాణించాలి



- చదువుతోనే ఉజ్వల భవిష్యత్
- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం
- సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి





**కొడంగల్,నవంబర్ 24:** మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతున్నాననని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు. కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నా మన్నారు. దీంతో ప్రభుత్వ మిగతా2లో...

## బిసి రిజర్వేషన్లపై
# కాంగ్రెస్ ద్రోహం

- కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తాం
- 42శాతం ఇవ్వకుండా దేశమంతా రాహుల్ ప్రయారం
- రాహుల్ బిసి వ్యతిరేకతను ఢిల్లీలోనే ఎండగడతాం
- వచ్చే పార్లమెంటులో దీనిపై రాహుల్ చర్చించాలి
- బిఆర్ఎస్ నేతల సమావేశంలో కెటిఆర్ వెల్లడి



**హైదరాబాద్,నవంబర్ 24:** బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహంపై ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని అన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బీసీ ప్రజా ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్‌తో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ మిగతా2లో...

## మహిళా స్వయం సహాయక సంఘాలకు
# 304 కోట్లు

● విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ● అధికారులో డిప్యూటి సిఎం వీడియో కాన్ఫరెన్స్





**హైదరాబాద్,నవంబర్ 24:** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. తాజాగా మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మిగతా2లో...



## తమిళనాడులో
# ఘోర రోడ్డు ప్రమాదం

రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొని ఆరుగురు దుర్మరణం

**చెన్నై, 24:** తమిళనా డులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ–మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు మిగతా2లో...

## త్వరలోనే పంచాయితీ
# ఎన్నికలు

● రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ ● కొడంగల్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి



**కొడంగల్,నవంబర్ 24:** రాష్ట్రంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవ ద్దని సూచించారు. అభివృద్ధి చేసే వారికే అండగా నిలవండి అని కోరారు.సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల కోసం రాజకీయాలను పక్కనబెట్టా లని సూచించారు. అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటే అని సంకేతమివ్వాలని సూచించారు. కొడంగల్ లో పర్యటన సందర్భంగా అక్షయ పాత్ర మిగతా2లో...

# ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

- వసతుల కల్పనకు కేంద్రం చర్యలు
- సక్రమంగా వినియోగించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జమ్మికుంటలో ఆధునిక వైద్య పరకరాలు ప్రారంభించిన బండి



**కరీంనగర్,నవంబర్ 24:** పేద ప్రజలు అత్యవసర చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను విశ్వసించి వస్తారని, ఆ నమ్మకాన్ని పెంపొందించే దిశలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బండి సంజయ్ తెలిపారు. మిగతా2లో...

## కోకాపేటలో తిరగరాసిన రికార్డులు



2లో

# అన్ని రంగాల్లో పిల్లలు రాణించాలి

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నా మని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిఎం పలు అభివృద్ధి కార్యక్రామలు చేపట్టడంతో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులకు కొత్త ఊపు వచ్చింది. మొత్తం రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ (జఉఆ) వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీలపై, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు బీసీలకు బడ్జెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీసీ వర్గాలకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఏ ఇతర ప్రభుత్వ చరిత్రలో ఎప్పుడూ చేసిన దాఖలాలు లేవని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ముఖ్యంగా కుల వృత్తులకు సహకారం అందించడం నుంచి మొదలుకొని విద్యారంగంలో ఏర్పాటుచేసిన విద్యా సంస్థల వరకు బీసీ వర్గాలకు కేసీఆర్ చేసిన మేలును తెలంగాణలోని బీసీలు గుర్తుంచుకున్నారని, వారంతా కేసీఆర్ వెంటే ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్.. కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్ల పేరుతో చేస్తున్న మోసంపై ఒక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని పార్టీ నేతలంతా ప్రజల్లోకి తీసుకువెళ్తారని తెలియజేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలోనే పార్టీకి అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పాల్గొన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజక వర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు. ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిం దంటూ బీఆర్‌ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెలెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకా లను ప్రారం భించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్‌ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

# ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

(మొదటి పేజీ తరువాయి)

కోటి యాభై లక్షల రూపాయల సిఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక పేదలకు నమ్మకం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు సిఎస్సార్ నిధుల ద్వారా ఐదు కోట్ల రూపాయలు అందజేసి ఆధునిక పరికరాలను తీసుకురావడంలో విజయవంతమయ్యామని చెప్పారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం రూమ్, ఎక్స్?రే మిషన్‌తో పాటు అవసరమైన ఇతర పరికరాలను ఎంపీ నిధుల ద్వారా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. పరికరాల లేమి పేరుతో పేద రోగులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయొద్దని వైద్యులకు సూచించారు. సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై మంచి విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని చెక్‌డ్యాంల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని బండి సంజయ్ ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల వద్ద నుంచి కమీషన్లు తీసుకుందని, ప్రణాళిక లేకుండా చెక్‌డ్యాంలను నిర్మించారని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నారని అన్నారు. చెక్‌డ్యాంలపై విచారణ జరిపించి అవినీతి నిర్ధారణ అయితే కాంట్రాక్టర్ల నుంచి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను పూర్తిగా ఆధునీకరించేందుకు త్వరలో ప్రపోజల్స్ పంపుతామని, జమ్మికుంటలో స్టేడియం నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని బండి సంజయ్ ప్రకటించారు.

# సనత్‌నగర్ ఇఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం

**• సెంట్రింగ్ కూలి ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**హైదరాబాద్,నవంబర్ 24:** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సోమవారం ప్రమాదం జరిగింది. భవనం మరమ్మతులు చేస్తుండగా.. సెంట్రింగ్ కుప్పకూలింది. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారు.

# కోకాపేటలో తిరగరాసిన రికార్డులు

**• ఎకరం ధర రూ.137.25 కోట్లు**



**హైదరాబాద్,నవంబర్ 24:** హైదరాబాద్ కోకాపేటలో ప్లాట్లు రికార్డు ధర పలికాయి. నియోపోలిస్ దగ్గర రికార్డు స్థాయిలో ప్లాట్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గత రికార్డులను ఇది తిరగరాసింది. అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను ఊఓఆంకి రూ.1,355.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన అధికారులు వేలం వేయనున్నారు.కాగా, నియోపోలీస్ లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడుతున్నాయి. అంతేకాకుండా, ఇక్కడ ఎన్ని అంతస్తులు నిర్మించాలన్న దానిపై పరిమితి కూడా లేదని తెలుస్తోంది.

# నేడు అయోధ్యలో ప్రధాని మోడీ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక-సాంస్కృతిక-ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల తొమ్మదవ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధాన్యం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరాలను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరానికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

# బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి

(మొదటి పేజీ తరువాయి)

పది రోజుల క్రితం ముంబై లోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది.1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్ వీర్', 'సీతా ఔర్ గీత', 'యాదోం కి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఇదిలావుంటే బాలీవుడ్ స్టార్ ధర్మేంద్ర అంత్యక్రియలను అత్యంత గోప్యంగా నిర్వహించారు.

# ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమ య్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమ య్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికం గా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌లను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

# మరో 15మంది మావోల లొంగుబాటు

**రాయ్‌పూర్,నవంబర్ 24:** మావోయిస్ట్ ల లొంగుబాటు కొనసాగుతోంది తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

కిచెన్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే రూ.103కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థా పన చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ప్లలె వెలుగు బస్సును ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.5వేల కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తా మని.. రాష్ట్రం నలుమూలల నుంచి చదువు కోసం కొడంగల్‌కు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఢిల్లీకి నోయిడా తరహాలో కొడంగల్ మారబోతోందని పేర్కొన్నారు.

# తిరుమల భక్తుల విశ్వాసం దెబ్బతీసిన వైకాపా

**• ఎక్స్ వేదికగా వార్తను పోస్ట్ చేసిన పవన్ కళ్యాణ్**

**అమరావతి,నవంబర్ 24:** వైకాపా ప్రభుత్వంలో టిటిడిబోర్డు, అధికారులు భక్తుల హృదయాలను విచ్ఛిన్నం చేశారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీపై ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అప్పట్లో 20 కోట్ల కల్తీ లడ్డూలు విక్రయించారని ఆ వార్తలో పేర్కొన్నట్లు చెప్పారు. తిరుమల కేవలం ఆలయం కాదు.. మన భక్తికి మూలం. ఎంతో భక్తిభావంతో అక్కడికి వెళ్తాం. 2019-24 మధ్య రోజుకు 60వేల మంది చొప్పున దాదాపు 10.97 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో రాష్ట్రపతి, ప్రధానితో పాటు రాజ్యాంగబద్ధమైన పదువులు చేపట్టినవారు, వివిధ రంగాల ప్రముఖులూ ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోంది

- సూది, మందులు, దూది కూడా ఉండటం లేదు
- కేంద్ర నిధులను సరిగా వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- అతి త్వరలో జమ్మికుంట రైల్వే స్టేషన్ ఆధునీకరణ
- స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- ప్రభుత్వ ఆసుపత్రికి ఇచ్చిన పరికరాలను వాడుకోకుంటే వాపస్ తీసుకుంటానని స్పష్టీకరణ





చర్చ:- బ్యూరో కరీంనగర్ :ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఆసుపత్రుల్లో సూది, మందులు, దూది కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో పెద్ద ఎత్తున నిధులను సరిగా వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈరోజు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. దాదాపు రూ.కోటి విలువైన వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. ఆ సేవలను కలెక్టర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం రోగులను కలిసి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశమై ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే....ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ కోసం వచ్చేది పేదలు, మధ్య తరగతి ప్రజలు మాత్రమే. వాళ్లకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకునే స్థోమత ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రులకు పెద్ద ఎత్తున నిధులిస్తోంది. ప్రజలకు వైద్య సేవల పట్ల భరోసా ఇచ్చేందుకు యత్నిస్తోంది. దురదృష్టమేందంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను సరిగా ఉపయోగించడం లేదు. ఆసుపత్రికి వెళితే సూదులు, మందులు, దూది కూడా లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేకుండా పోతోంది. ఈ పరిస్థితిపై గతంలో నేను రివ్యూ చేశాను. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వాళ్లు బయటకు వెళ్లకుండా పూర్తిస్థాయిలో సేవలందించాలంటే ఏం చేయాలని అడిగాను. డాక్టర్లు ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనల మేరకు నా బర్త్ డే నాడు రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించాను. వేములవాడ, జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్ఎండీసీ సంస్థ సాయంతో ఆధునాతన వైద్య పరికరాలను కొనుగోలు చేసి అందించాం. అందులో భాగంగా జమ్మికుంట సామాజిక వైద్య శాలకు ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్, ఆటోక్లేవ్ ఆపరేషన్, డయాథెర్మి మిషన్, అనెస్తిషియా, ఎమర్జెన్సీ రికవరీ ట్రాలీ, సిరంజ్ పంప్ సహా మొత్తం 15 పరికరాలను అందించాను. ఇకపై జమ్మికుంట ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలోనే ఎంపీ లాడ్స్ నుండి ఎక్స్ రే మిషన్ ను కూడా అందజేస్తా. దయాచేసి ఆ పరికరాలను రోగుల కోసం వినియోగించుకోవాలి. పట్టించుకోకుంటే మాత్రం వాటిని వాపస్ తీసుకుని పోయి ఇతర చోట్ల అందిస్తా. పేదలు ప్రభుత్వ ఆసుపత్రులను నమ్ముకుని వస్తే...వారికి పైసా భారం లేకుండా చికిత్స చేసి పంపాలని కోరుతున్నా. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు నెంబర్ వన్ గా ఉండేలా చూడాలని కోరుతున్నా. దురదృష్టం ఏమిటంటే.... కొన్ని చోట్ల అంబులెన్సులు ఇచ్చినా వాడుకోవడం లేదు... అట్లయితే వాపస్ తీసుకుని వేరేవాళ్లకు ఇస్తా. వేములవాడ, కరీంనగర్ ఆసుపత్రుల్లో ఇట్లనే చేస్తే వాటిని వాపస్ చేసి వేరే ఆసుపత్రులకు పంపిన. ఇట్లయితే పేదలకు వైద్య సేవలు అందేది ఎట్లా? ఇది సరికాదు. డాక్టర్లు తమ మైండ్ సెట్ ను మార్చుకోవాలి.

చెక్ డ్యాం కూలిపోవడంపై స్పందిస్తూ...చెక్ డ్యామ్ లు ప్రజల కోసం, రైతుల కోసం కాదు. కమీషన్ల కోసం చెక్ డ్యామ్ లను కడుతున్నారు. గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం కూడా బడా కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగడం లేదు. కమీషన్లు ఇస్తున్నారు.



నాసిరకం పనులు చేస్తున్నారు. ఆ చెక్ డ్యామ్ లు కూలిపోతున్నారు. ప్రణాళిక లేకుండా క్వాలిటీతో పనిలేకుండా చెక్ డ్యామ్ లు నిర్మించారని గత 6 నెలలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. పట్టించుకోవడం లేదు. గతంలో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలోనూ చెక్ డ్యాంలు కూలిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చెక్ డ్యాంల కూలిపోవడంపై విచారణ జరపాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అట్లాగే కాంట్రాక్టర్ ఆస్తులను సీజ్ చేయాలి. అప్పుడే వాళ్లలో భయం ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కమీషన్లు తప్ప ఇంకోటి పట్టడం లేదు. బీఆర్ఎస్ కు తొత్తులుగా పనిచేసిన వాళ్లకు కూడా పైసలు తీసుకుని మంచి పోస్టింగ్ లు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ కూడా ఇది గ్రహించి పైసలిచ్చి పంపిస్తున్నారు.

జమ్మికుంటకు స్పోర్ట్ స్టేడియం నిర్మాణం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదనలు రడీ చేస్తున్నారు. త్వరలోనే ఈ రెండు పనులను పూర్తి చేస్తాం.

# సర్కారీ ఆసుపత్రులకు బండి సంజయ్ సాయం

- రూ.4 కోట్ల విలువైన వైద్య పరికరాలను అందించిన కేంద్ర మంత్రి
- జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఆసుపత్రులకు దాదాపు రూ.కోటి చొప్పున విలువైన వైద్య పరికరాల అందజేత
- జిల్లా కలెక్టర్ తో కలిసి జమ్మికుంట, హుజూరాబాద్ ఆసుపత్రులను సందర్శించిన కేంద్ర మంత్రి
- పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెబుతున్న డాక్టర్లు
- ఆసుపత్రికి వచ్చే రోగులపై రూపాయి భారం పడకుండా ఉచితంగా వైద్యం అందించండి
- డాక్టర్లను కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- సొంత నిధులు, సీఎస్సార్ ఫండ్స్ తో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పిస్తానని హామీ







చర్చ:- బ్యూరో కరీంనగర్ :"దయచేసి ఇకపై ప్రభుత్వ ఆసుపత్రులుకు వచ్చే పేద రోగులను టెస్టుల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపొద్దు. వారిపై భారం మోపద్దు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేదే పేదలు. వారికి రూపాయి ఖర్చు లేకుండా పూర్తి చికిత్స చేసి పంపేలా చర్యలు తీసుకోండి."అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. ఈరోజు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ ఆసుపత్రికి దాదాపు కోటి రూపాయల అత్యాధునిక వైద్య పరికరాలను సీఎస్సార్ నిధుల ద్వారా కొనుగోలు చేసి అందించారు. ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్(లార్జ్), డయా థెర్మా మిషన్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫెటల్ మానిటర్ సహా మొత్తం 15 వైద్య పరికరాలను అందించారు. ఆయా పరికరాల సేవలను ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రారంభించారు. కాసేపట్లో హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులను కూడా సందర్శించనున్నారు. వాస్తవానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు టెన్త్ క్లాస్ చదివే దాదాపు 20 వేల మంది విద్యార్థులకు ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను అందించిన సంగతి తెలిసిందే త్వరలోనే 9వ తరగతి విద్యార్థులకు సైతం సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వ స్కూళ్లలో 1 నుండి 6వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీ బాక్స్, వాటర్ బాటిల్ తో కూడిన కిట్స్ ను మోదీ గిఫ్ట్ పేరుతో అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు సీఎస్సార్ నిధులతోపాటు పలువురు వ్యాపారులు, దాతల సాయంతో నిధులు సమకూరుస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా బండి సంజయ్ ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలి టీ(సీఎస్సార్) రూ.4 కోట్ల నిధులను సేకరించి వేములవాడ, జమ్మికుంట, హుజూరాబాద్, హుస్నాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను కొనుగోలు చేసి అందించారు. వేములవాడలో రూ.1.5 కోట్ల వ్యయంతో దాదాపు 16 వైద్య పరికరాలను అందించిన బండి సంజయ్ ఇటీవల వేములవాడ పర్యటనలో భాగంగా ఆ ఆసుపత్రిని సందర్శించి ఆయా వైద్య సేవలను ప్రారంభించారు. తాజాగా ఈరోజు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి జమ్మికుంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. కాసేపట్లో హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి అక్కడ ఒక్కో ఆసుపత్రికి రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేసి అందించారు. ఈసీజీ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, మల్టిపురా మానిటర్, ఆటోక్లేవ్(లార్జ్), డయా థెర్మా మిషన్, అనెస్థిషియా వర్క్ స్టేషన్, ఈఎన్టీ హెడ్ లైట్, ఫెటల్ మానిటర్ సహా మొత్తం 15 వైద్య పరికరాలు వీటిలో ఉన్నాయి. ఆయా పరికరాల సేవలను కూడా కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించనున్నారు. గతంలో కరీంనగర్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి సైతం తన బర్త్ డే కానుకగా దాదాపు రూ.3 కోట్ల విలువైన అంబులెన్సులు, ఎక్స్ రే మిషన్ సహా అత్యాధునిక వైద్య పరికరాలను బండి సంజయ్ అందించిన విషయం తెలిసిందే. కొన్ని సందర్భాల్లో తన సొంత ఖర్చుతో వాటికి అయ్యే మెయింటెనెన్స్ ఛార్జీలను కూడా బండి సంజయ్ చెల్లిస్తుండటం గమనార్హం.

# కార్మికుల హక్కులను కాలరాసేందుకే నాలుగు లేబర్ కోడ్‌లు

- కోడ్‌ల రద్దుకై నేడు, రేపు జాతీయ సంఘాల నిరసనలు




చర్చ, సింగరేణి, కొత్తగూడెం:ుకు, భారత పారిశ్రామిక రంగాన్ని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించేందుకు, దోపిడి శక్తులకు ఎదురు లేకుండా చేయడానికే కేంద్ర ప్రభుత్వం నూతనంగా 4లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని శేషగిరిభవన్‌లో కార్మిక నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి, 4 చట్ట స్వభావం లేని కోడ్‌లుగా మార్చడాన్ని సింగరేణి కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయన్నారు. కొత్త చట్టాలను రద్దు చేసి పాత 29 చట్టాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాలన్నీ ధర్నాలు, ఆందోళనలు, సమ్మెలు చేసినా కేంద్రం పెడచెవిన పెట్టిందని, కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల కోసమే కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కోడ్ లను అనుమతించమని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 25న అన్ని గనుల డిపార్టుమెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, 26న జిల్లా కలెక్టర్లకు మెమోరండాలు ఇవ్వడం, అదే రోజు సాయంత్రం సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని సంఘాల కార్యకర్తలు, నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియుసి, ఐఎన్‌టియూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు సారయ్య, వంగ వెంకట్, రమణమూర్తి, వీరస్వామి, గట్టయ్య, ఎర్రగని కృష్ణయ్య, హుమాయూన్, సందబోయిన శ్రీనివాస్, నాయకులు నరసింహ రావు, పీతాంబరం, కాపు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఆల్బర్ట్, తుమ్మ శ్రీను, ఐలయ్య, లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## వైరా రిజర్వాయర్ ఆయకట్టు కు రబీ సీజన్ సాగు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించాలి -తెలంగాణ రైతు సంఘం



చర్చ బ్యూరో,ఖమ్మం :వైరా రిజర్వాయర్ ఆయకట్టు కు రబీ సీజన్ సాగు నీరు విడుదల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులకు వినితి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు, యూరియా కొరత మూలం గా వరి ధాన్యం దిగుబడి తగ్గింది అని అన్నారు. వైరా ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనులు పెండింగ్ లో ఉండటం మూలంగా రైతులు రబీ సీజన్ సాగు నీరు విడుదల పై స్పష్టత లేకపోవడం తో సీజన్ ఆలస్యం అవుతుంది అనే అభిప్రాయం తో ఉన్నారు అని వెంటనే అధికారులు సాగు నీరు విడుదల ప్రణాళిక ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు, పారుపల్లి కృష్ణారావు, కురకుంట్ల శ్రీనివాసరావు, సంక్రాంతి నర్సయ్య,గొల్లపూడి ప్రకాశరావు బెజవాడ వీరభద్రం, మాడపాటి వెంకట్, వడ్లమూడి మధు,వెంపటి రాజా, వెంపటి సత్యం, పాసంగులపాటి చలపతిరావు , సంక్రాంతి పురుషోత్తం , ఎస్ కె బిలాల్ తదితరులు పాల్గొన్నారు

## ఏఐటియుసి ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు





చర్చ, కొత్తగూడెం సింగరేణి:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్స్ నందు నిరసన తెలిపి మెమొరాండలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేసే ట్రేడ్ యూనియన్‌లను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని కేంద్రంపై మండిపడ్డారు. సింగరేణి సంస్థను మెల్లగా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్తుందని అన్నారు. కార్మికులను 12 గంటల పనిని చేయిస్తూ శ్రమ దోపిడి చేస్తున్న బడా పెట్టుబడిదారులను పెంచి పోషిస్తుందని మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయి ధ్వజమెత్తారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. కోడ్‌ల అమలు వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సహాయ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.వీరాస్వామి, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బేరర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, పిట్ కార్యదర్శిలు హుమాయూన్, మధుకృష్ణ, కమల్, ఏం ఆర్ కే ప్రసాద్, సీనియర్ నాయకులు రాజపూడి సాంబమూర్తి, సురేందర్, మాచర్ల శ్రీనివాస్, జడల ప్రకాశ్, మురళి, భుక్య రమేష్, సాయి పవన్, బండి వెంకటరమణ, వినయ్, పడాల కృష్ణ, సుబ్రమణ్యం, అవినాష్, దీక్షిత్, మెయిన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ- నిరుద్యోగ యువతకు మంచి అవకాశం




చర్చ:- హుస్నాబాద్:ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ ఈడి సెల్ ఆధ్వర్యంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, వరంగల్ వారి సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు 50 రోజుల పాటు ఉచిత టూవీలర్ సర్వీస్ టెక్నీషియన్ ట్రైనింగ్ ను కల్పించుచున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. ఇది పూర్తి రెసిడెన్షియల్ ట్రైనింగ్ అని, శిక్షణా కాలం లో ఉచిత భోజన వసతి మరియు ఉచిత హాస్టల్ వసతి కల్పించబడతాయనని తెలిపారు. ట్రైనింగ్ పూర్తి చేసిన యువతకు కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్ మరియు ఉద్యోగాలు కల్పించబడతాయని తెలుపుతూ, ఆసక్తి కలిగి 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతి యువకులు తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకై కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. నైయనాదేవి ని, సంప్రదించగలరని తెలిపారు. నమోదు చేసుకున్న యువతి, యువకులతో మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమం ఈ డిసెంబర్ 1వ తేదీ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్ లో ప్రారంభమవుతుందని తెలిపారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి





చర్చ :- కరీంనగర్ :ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ .. అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు.

మొత్తం 352 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 67, హౌసింగ్ శాఖకు సంబంధించి 74 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను సద్వినియేగం చేసుకోవాలి మండె



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:పిఏసిఎస్ కొత్తగూడెం అధ్వర్యంలో ఏఎంసి కొత్తగూడెం నందు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను సొసైటి చైర్మన్ మండె వీరహనుమంతరావు సందర్శించటం జరిగినది. ఈ సందర్బంగ ఏఎంసి కొత్తగూడెం నకు మొక్కజొన్న తీసుకొచ్చిన రైతులతో మాట్లడతూ, మొక్కజొన్న ను దళారులు రూ 1700/- లకు కొనుగోలు చేస్తూన్నారని కాని మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర రూ 2400/- గా ఉన్నదని, కావున రైతులందరు పిఏసిఎస్ కొత్తగూడెం ద్వార నడుస్తూన్న మొక్కజొన్న కొనుగొలు కేంద్రం ను సద్వినియేగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరను పొంది ఆర్థికంగా అభివృద్ధి చేందాలని అన్నారు, రైతులను ఇబ్బంది పెట్టకుండా మొక్కజొన్న కొనుగొలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారిచేసినారు. కొనుగొలు కేంద్రం ను సద్వినియేగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు, రైతులను ఇబ్బంది పెట్టకుండా మొక్కజొన్న కొనుగొలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారిచేసారు.

# బాబు జగ్జీవన్ రావ్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**– తెలంగాణ ప్రజా కవి చుక్క రామ నర్సయ్య**



**చర్చ, పాల్వం:**పాల్వంచలో ఏర్పాటుచేసిన బాబు జగ్జీవన్ రావ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా కవి చుక్క రామ నరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం పాల్వంచ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే కనివిని ఎరుగని రీతిలో విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కళాకారులు, కవులు పాల్గొనే ఈ కార్యక్రమాల్లో 200 మంది డప్పు కళాకారులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం స్వర్గీయ కవి అందెశ్రీని స్మరించుకుంటూ మౌనం పాటించి నివాళులర్పించారు. చివరిగా కమిటీ సభ్యులు రామ నరసయ్యను ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రావ్ సేవాసమితి అధ్యక్షులు దండోరా శ్రీను, గౌరవాధ్యక్షులు కాల్వ భాస్కరరావు , కొత్తపల్లి సోమయ్య,గౌరవ సలహాదారు లు కాల్వ ప్రకాష్ రావు,ముళ్ళపాటి రాజేంద్ర కుమార్ ,గొడ్ల మోహన్రావు, శ్రీరాములు, దేవిలాల్ నాయక్, ఆదాం, మధు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మేసిన పొగ మంచు

- **వాహనదారుల ఇబ్బందులు**





**చర్చ:– అశ్వారావుపేట :**పొగమంచు దుప్పటిలా కమ్మేసింది ఎక్కడో కాదు ఇక్కడే అశ్వారావుపేట పట్టణ కేంద్రంలోని అశ్వారావుపేట ఖమ్మం జాతీయ రహదారి స్థానిక రింగ్ సెంటర్ నుండి పట్టణం బయట వరకు పట్టణం అంతటా పొగ మంచు పూర్తిగా వ్యాపించి ఉండటంతో ఉదయం 8గంటలకు కూడా మంచు తగ్గకపోవడంతో లారీలు కార్లు లైట్లు వేసుకుంటూ వెళ్లే పరిస్థితి ఏర్పడింది. వాహనాలు దగ్గరికి వచ్చే వరకు ఎదురుగా వచ్చేవి ఏవి కూడా సరిగా కనపడకపోవడంతో ఏవైనా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయేమోనని వాహన దారులు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంచు తీవ్రత తెల్లవారుజామున తీవ్రంగా ఉండటంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. మంచు తీవ్రత తగ్గిన తర్వాత వాహనాలు రాకపోకలు మొదలయ్యాయి. ఉదయం వాకింగ్ కి వెళ్లేవారికి దగ్గరగా ఉన్న రోడ్డు కూడా కనపడకపోవడంతో వాకింగ్ కి బ్రేక్ వేశారు.

## మండల కేంద్రంలో నూతన మెడికేర్ హాస్పిటల్ ప్రారంభం



**చర్చ:– కోహెడ :** మండల కేంద్రంలో సోమవారం రోజున కొత్త బస్టాండ్ ఆవరణలో హుస్నాబాద్ రోడ్ రహదారిలో చెంచల్ చెర్వు పల్లిగ్రామానికి చెందిన వైద్యులు వడ్డేపల్లి చంద్రమౌళి నిర్మల గార్ల కుమారుడు– కోడలు డాక్టర్ శ్రవణ్ కుమార్ స్త్రీల వైద్య నిపులు డాక్టర్ రవంతి గార్ల ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పబడిన మెడికేర్ హాస్పిటల్ ప్రారంభోత్స కార్యక్రమంలో కోహెడ మండల బిజెపి సోషల్ వారియర్ గుగ్గిళ్ల శ్రీనివాస్ గారితో పాటు కోహెడ మండల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండ జగన్ యాదవ్ కోహెడ మండల మెడికల్ షాప్ యూనియన్ అధ్యక్షులు పీచుక శ్రీనివాస్,
శనిగరం రమేష్, పిల్లి ప్రభాకర్, గూడూరి ఆంజనేయులు, జాగిరి శ్రీనివాస్ కొన్నే కుమార్, రాజు, ప్రసాద్ మెడికల్ తదితరులు ఉన్నారు

## చీరలతో పాటు మహాలక్ష్మి పథకం అమలు చేయండి

- **ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి**



**చర్చ, సత్తుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని చీరలతో పాటు మహాలక్ష్మి చేయూత పథకాన్ని కూడా వెంటనే అమల్లోకి తీసుకురావాలని ఐద్వా సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతోమాట్లాడుతూ ఉచిత బస్సు బస్సుల అమలు చేసి బస్సుల సంఖ్య పెంచకపోవడంతో మహిళలు ఎన్నో ఇబ్బందులు గురవుతున్నారని బస్సుల సంఖ్య పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టే ముందు ఆరు గారెంటీలను అమలు చేస్తానని క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రజలకు సామాజిక న్యాయం తో పాటు ఆర్థిక సాధికారతను చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వాగ్దానం చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా మహాలక్ష్మి పథకం కింద నగదు తో పాటు తులం బంగారం ఇస్తానన్న మాట నీటి మూట అయింది అన్నారు. అలాగే అర్హులైన ప్రతి మహిళకు నెలకు 2,500 . రెండు సంవత్సరాలకు ప్రతి మహిళకు చూసుకున్నట్లయితే ఇప్పటికే 50 వేల రూపాయలు అందాల్సి ఉంది కానీ ఈ పథకం అమలుకు నోచుకోలేదు అన్నాను. మహిళలకు ఫ్రీ బస్సు అని బస్సుల సంఖ్యను ప్రభుత్వం తగ్గించిందని. గ్రామీణ ప్రాంతాలకు అసలు బస్సు సౌకర్యమే లేదు కాబట్టి తెలంగాణ ప్రభుత్వం ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించాలంటే మహాలక్ష్మి పథకం చేయూత పథకం వెంటనే అమలుపరచాలి .అలాగే గ్రామీణ ప్రాంత మహిళల సౌకర్యార్థం బస్సు సర్వీసును పెంచి ఏదైతే వాగ్దానం చేసిందో వెంటనే అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## సరస్వతి శిశుమందిర్‌లో మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్





**చర్చ, పాల్వంచ:** స్థానిక శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో సోమవారం మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్దేశించి ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ విద్యార్థులు, మేము అరణ్య పునరుద్ధరణ వైపు ఒక అర్థవంతమైన అడుగు వేశామన్నారు. వందలాది సీడ్ బాల్స్ తయారు చేసి, సమీప అటవీ ప్రాంతంలో విసిరి వృక్ష సంపదను, వన్య ప్రాణులను సంరక్షించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి శిబిరంలో తమ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, మొక్కలు, నేల, పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి నేర్చుకున్నట్లు చెప్పారు. ప్రకృతిపట్ల బాధ్యతాభావం, ఆనందం, ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వివరించారు. మరింతమంది ప్రజలను పర్యావరణాన్ని కాపాడేందుకు, సంరక్షించేందుకు ప్రేరేపించాలనుకుంటున్నట్లు చెప్పారు. పచ్చని భవిష్యత్తు కోసం అందరం కలిసి ముందడుగు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి ఆనంద్, వైస్ ప్రెసిడెంట్ దుర్గ మహేష్ , ప్రవీణ్, తల్లిదండ్రులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రాచలం నియోజకవర్గం లోని ఇసుక లారీలను అడ్డుకున్న జిల్లా అధ్యక్షులు రేగ మరియు బిఆర్ఎస్ శ్రేణులు



**చర్చ బ్యూరో,భద్రాద్రి కొత్తగూడెం :**ఇసుక దోపిడీ తో కోట్లాది రూపాయలు దోచుకుంటూ ఏజెన్సీ లోని ప్రధాన రహదారి ధ్వంసం చేస్తూ ఉంటే ఊరుకోం ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ప్రజల పక్షాన అభివృద్ధి చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటాం– రేగా హెచ్చరికదుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల వద్ద ప్రధాన రహదారిపై సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు ఇసుక లారీల దిగ్బంధం చేపట్టగా, ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని ప్రసంగిస్తూ నిత్యం వేలాది లారీలతో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం నుండి కోట్లాది రూపాయల ఇసుకను దోపిడీ చేస్తూ కనీసం ప్రధాన రహదారి ధ్వంసమై, దుమ్ము దూళితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్న ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువు పాలవుతున్న పాలక ప్రభుత్వం మంత్రులు స్థానిక ఎమ్మెల్యే కనీసం పట్టించుకునే పాపాన పోవడం లేదని, దోచుకోవడం దాచుకోవడమే తప్ప ప్రజా సంక్షేమం అభివృద్ధి ఆలోచనే లేకుండా పోయారని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి జరిగే వరకు, ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. అబద్ధపు వాగ్దానాలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ పాలకులకు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అభివృద్ధి చేస్తానని చెప్పి పార్టీ మారిన ఎమ్మెల్యే తన వ్యక్తిగత అభివృద్ధి తప్ప ప్రజల బాధలుకానీ రోడ్ల దుస్థితి కానీ కనిపించడం లేదని, తనను గెలిపించిన ప్రజలను కార్యకర్తలను వదిలి ఓడించడానికి ప్రయత్నించిన వాళ్ళతో జతగట్టి దోచుకుంటున్నాడని విమర్శించారు. గత కెసిఆర్ పాలనలో అభివృద్ధికి నిధులు వరదలా వచ్చేవని రేవంత్ రెడ్డి పాలనలో నిధుల అభివృద్ధి అడ్రస్ లేకుండా పోయాయని, ఈ పోరాటం ప్రారంభం మాత్రమే అని భవిష్యత్ లో వేలాదిమంది తో జిల్లా రోడ్లన్నీ అభివృద్ధి చేసేంతవరకు దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ దిగ్బంధం కార్యక్రమంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇసుక లారీలను మాత్ర మే నిలిపివేసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈకార్యక్రమం లో భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇంచార్జి సీనియర్ నాయకులు మానే రామకృష్ణ, డివిజన్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కోకన్వీనర్ అయినవోలు, పవన్ కుమార్ దుమ్ముగూడెం మండల కన్వీనర్ కనితి రాముడు, కో కన్వీనర్ ఎండి జానీ పాషా, చర్ల మాజీ మండల అధ్యక్షులు సోయం రాజారావు, చర్ల పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, తడికల బుల్లబ్బాయి, తుర్రం రవి, అంబోజి సతీష్, కట్టం కన్నారావు, నాగరాజు, కనుకు వీరభద్రం, వంకాయల కృష్ణ , తుర్రం రాజు, సంతపురి సతీష్, బట్ట కొమరయ్య, గాథంశెట్టి కిషోర్, కుక్కదప్పు సాయి, చెన్నుమల్ల వంశి,ఆర్ఎంపి రాజు సాంబశివరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# రెండు ప్రాణాలు బలి తీసుకున్న సరదా

- **విహారానికి వెళ్లి మనవడు గుండెపోటు తో నాయనమ్మ మృతి**





**చర్చ, అశ్వారావుపేట:**ఆదివారం సరదాగా విహారానికి వెళ్లి వాగులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు వాగులో మునిగిపోయి అశ్వారావుపేటలోని దొంతికుంట ప్రాంతానికి చెందిన గుమ్మళ్ళ యశ్వంత్ అనే పదవ తరగతి విద్యార్థి మృతి చెందాడు వివరాల్లోకి వెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ పరిధిలోని దొంతికుంట ప్రాంతానికి చెందిన పదవ తరగతి విద్యార్థి యశ్వంత్ తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఆంధ్రా సరిహద్దుల్లోని సంగం వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద ఆటలు ఆడుతూ అందరూ సరదాగా గడిపిన అనంతరం వాగులోకి స్నానానికి దిగగా ఇద్దరు బాలురు నీట మునిగిపోయారు. వాగు లోతు అంచనా వేయకుండా వీరు స్నానానికి దిగిన ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండటంతో క్షణాల్లో ఇద్దరూ మునిగిపోయారు. అందులో ఒక బాలుడు సురక్షితంగా బయటపడగా గుమ్మళ్ళ యస్వంత్ అనే బాలుడు మాత్రం గల్లంతయ్యాడు. స్నేహితులకు యశ్వంత్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానికులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకున్న స్థానికులు సంగం వాగులో గాలించగా యస్వంత్ మృతదేహం లభించింది. మృతి చెందిన యస్వంత్ అశ్వారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతుండగా ఆదివారం సరదాగా విహారానికి అని వెళ్ళిన తమ కుమారుడు జీవచ్ఛవంగా ఇంటికి చేరడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మనవడు యశ్వంత్ మృతి చెందిన విషయం తెలుసుకున్న నాయనమ్మ ఎంకులమ్మకు గుండెపోటు రావడంతో వృద్ధ మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. ఒకే రోజు నాయనమ్మ ఎంకులమ్మ, మనవడు యశ్వంత్ ఇద్దరు తిరిగిరాని అనంత లోకాలకు వెళ్లడంతో ఆప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.విహారానికి వెళ్లి మనవడు – గుండెపోటు తో నాయనమ్మ మృతి చర్చ, అశ్వారావుపేట: ఆదివారం సరదాగా విహారానికి వెళ్లి వాగులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు వాగులో మునిగిపోయి అశ్వారావుపేటలోని దొంతికుంట ప్రాంతానికి చెందిన గుమ్మళ్ళ యశ్వంత్ అనే పదవ తరగతి విద్యార్థి మృతి చెందాడు వివరాల్లోకి వెళితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ పరిధిలోని దొంతికుంట ప్రాంతానికి చెందిన పదవ తరగతి విద్యార్థి యశ్వంత్ తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఆంధ్రా సరిహద్దుల్లోని సంగం వాగు వద్దకు వెళ్లారు. వాగు వద్ద ఆటలు ఆడుతూ అందరూ సరదాగా గడిపిన అనంతరం వాగులోకి స్నానానికి దిగగా ఇద్దరు బాలురు నీట మునిగిపోయారు. వాగు లోతు అంచనా వేయకుండా వీరు స్నానానికి దిగిన ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండటంతో క్షణాల్లో ఇద్దరూ మునిగిపోయారు. అందులో ఒక బాలుడు సురక్షితంగా బయటపడగా గుమ్మళ్ళ యస్వంత్ అనే బాలుడు మాత్రం గల్లంతయ్యాడు. స్నేహితులకు యశ్వంత్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్థానికులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకున్న స్థానికులు సంగం వాగులో గాలించగా యస్వంత్ మృతదేహం లభించింది. మృతి చెందిన యస్వంత్ అశ్వారావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతుండగా ఆదివారం సరదాగా విహారానికి అని వెళ్ళిన తమ కుమారుడు జీవచ్ఛవంగా ఇంటికి చేరడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మనవడు యశ్వంత్ మృతి చెందిన విషయం తెలుసుకున్న నాయనమ్మ ఎంకులమ్మకు గుండెపోటు రావడంతో వృద్ధ మహిళ అక్కడిక్కడే మృతి చెందింది. ఒకే రోజు నాయనమ్మ ఎంకులమ్మ, మనవడు యశ్వంత్ ఇద్దరు తిరిగిరాని అనంత లోకాలకు వెళ్లడంతో ఆప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## వాసవి అమ్మవారి ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా కంచర్ల ప్రమాణ స్వీకారం





**చర్చ:– అశ్వారావుపేట :**ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అయినటువంటి శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ నిర్మాణం చేసి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అశ్వారావుపేట వాసవి అమ్మవారి ఆలయానికి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఆలయ మాజీ కమిటీ అధ్యక్షులు ముత్తా సుమాకర్ ఆధ్వర్యంలో అవారావుపేట మండల ఆర్య వైశ్యులు అందరు కలిసి ఏకగ్రీవంగా కంచర్ల రామారావును ఆలయ కమిటీకి 7వ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గతంలో వీరి తండ్రి కంచర్ల చిన సత్యం ఆలయ కమిటీ అధ్యక్షులుగా పనిచేసారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా కమిటీ బాధ్యులచే ఆర్య వైశ్య ప్రముఖులు ఆదివారం నాడు వాసవి ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేపించడం జరిగింది. అధ్యక్షులుగా కంచర్ల రామారావు, కార్యదర్శిగా కాకి సీతారామచంద్రగుప్త, ఉపాధ్యక్షులుగా సంకా ప్రసాదరావు, తోకల హరీష్ గుప్తా, పసుమర్తి వైకుంఠం, జాయింట్ సెక్రటరీగా జయవరపు లీలా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా వేముల రామకృష్ణ జాయింట్ కోశాధికారిగా కర్పూరం సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా జల్లిపల్లి అరవింద్ బాబు, శీమకుర్తి శివప్రసాద్, కలకోటి వెంకటేశ్వరరావు, చారుగుండ్ల కృష్ణవేణి, ఉప్పల గౌరీ, దూబగుంట్ల దుర్గారావు, దూబగుంట్ల వినోద్, జల్లిపల్లి దేవరాజ్, చీమకుర్తి సుబ్బారావు, ముఖ్య సలహాదారులుగా చీమకుర్తి వెంకటేశ్వరరావు, పోలేపల్లి గోపీనాథ్, జయవరపు మోహన్ రావు, ముత్తా సుమాకర్, కోరుకొండ రామ్మోహన్ రావు, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, కోరుకొండ భోగేశ్వరరావు, కొనిజర్ల ఉమామహేశ్వరరావు, చీమకుర్తి కేశవరావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, జల్లిపల్లి నరసింహారావు, భోగవల్లి రాంబాబులను ఎన్నిక చేసుకుని ప్రమాణ స్వీకారం చేపించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కమిటీ బాధ్యులను శాలువలు కప్పి అభినందించారు. ఆలయ నూతన కమిటీ అధ్యక్షులు కంచర్ల రామారావు మాట్లాడుతూ అలయ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని మన కుల దైవం వాసవి అమ్మవారి ఆలయంలో జరిగే ప్రతి దైవ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్ళేలా ఘనంగా నిర్వహించేలా మన ఆర్య వైశ్యులు ప్రతిఒక్కరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మరియు స్థానిక ఆర్య వైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి యూత్ లయన్స్ క్లబ్, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 150 సంవత్సరాల చరిత్ర పూర్తి చేసుకున్న వందేమాతరం

- **వందేమాతరం పేరుతో, మువ్వన్నెల జెండాతో సత్తుపల్లి లో భారీ ర్యాలీ**







**చర్చ బ్యూరో, ఖమ్మం :**ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రాంచందర్ రావు పిలుపు మేరకు , ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు సూచన మేరకు, సోమవారం సత్తుపల్లి నియోజకవర్గం లో చవందేమాతరం 150 పేరుతో బంకించంద్ర చటర్జీ వందేమాతరం గీతం రచించి150 సంవత్సరాల చరిత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా, భావితరాలకు ఆనాటి స్వాతంత్ర సమరయోధుల త్యాగానికి వందేమాతర గీతం ఎంత స్ఫూర్తినిచ్చిందో తెలియజేయడం కోసం, ఏ విధంగా వందేమాతరం నినాదం మంత్రమై స్వతంత్ర సమరయోధులు ముందుండి నడిపించిందో తెలియజేయడం కోసం, అదే విధంగా బంకించంద్ర చటర్జీ నిజానికి ఇప్పుడు మనం పాడుతున్న వందేమాతరం కన్నా ఇంకా చాలా వందేమాతరం ఉంది అని తెలియజేయడం కోసం , మరి ఆనాడు ఉన్న పాలకులు పూర్తి వందేమాతరాన్ని స్వీకరించకుండా కేవలం ఒక చరణం మాత్రమే స్వీకరించడానికి కారణాలను వివరించటం కోసం, ముఖ్యంగా వందేమాతరం యొక్క అర్థాన్ని ప్రజలకు, విద్యార్థులకు, యువతకు వివరించటం , తద్వారా వారిలో దేశభక్తిని, జాతీయ వాదాన్ని పెంపొందించడం ఇత్యాది కారణాలవల్ల దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం అంతా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలు చేతబూని వందేమాతరం నినాదం మార్మోగిస్తూ సుమారు 165 మీటర్ల పొడవున్న మువెన్నెల జెండాలను సత్తుపల్లి పట్టణంలో ప్రదర్శిస్తూ ర్యాలీ జరిగింది.ఈ కార్యక్రమంలో వందేమాతరం జిల్లా కో కన్వీనర్ పాల నాగ సురేందర్ రెడ్డి , స్థానిక సంస్థల ఎన్నికలు ఖమ్మం జిల్లా కన్వీనర్ ఈ వి రమేష్ , ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వర రావు ,జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా , భాస్కర్ని వీరంరాజు , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జొన్నలగడ్డ నరేష్, మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ , పట్టణ అధ్యక్షులు బాణోతు విజయ్, జిల్లా నాయకులు పడిగల మధుసూదన్ రావు , మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్ , జిల్లా నాయకులు నల్లమోతు నాని , పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ, నాయకులు చీకటి వసంతరావు, సాయి మరియు స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి కోపరేట్ చేసిన విశ్వశాంతి స్కూల్ యాజమాన్యానికి, శ్రీ చైతన్య స్కూల్(మిలీనియం ) యాజమాన్యానికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
నవంబర్ 25, 2025


# కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ లను వెంటనే ఉపసంహరించుకోవాలి

- ఐఎన్టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్

చర్చ, సత్తుపల్లి: సత్తుపల్లి సింగరేణిలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ సూచనలతో సత్తుపల్లి ఐఎన్టీద యూసీయూనియన్ సమావేశం నిర్వహించారు. సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని , కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల తో పాటు సింగరేణి ఐక్య కార్మిక సంఘాలు మన సింగరేణి సంస్థను , కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి చేసే పోరాటాలు , నిరసన కార్యక్రమాలలో



పెద్ద ఎత్తున ఐఎన్టియుసి నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొని జాక్ కార్యాచరణను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పిలుపునిచ్చారని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చడం వల్ల కార్మికులకు అనేక ఇబ్బందులు కలుగుతాయని ఈ కోడ్ లు అమలులోకి వస్తే కార్మిక సంఘాల ఉనికి కోల్పోవడమే కాక కార్మికులు సమ్మె హక్కు కోల్పోవడం , పని గంటల పెంపు , ఉద్యోగ భద్రత కోల్పోవడం తో పాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని తెలియజేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతి కార్మికుడు తన హక్కులను కాపాడుకోవడం కోసం తను పనిచేసే సంస్థను కాపాడుకోవడానికి ముందు వరుసలో ఉండి ఐక్య కార్మిక సంఘాల పిలుపుమేరకు ప్రతీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్ , రామారావు ( ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ ఓసి ) , బాలాజీ ( ఫిట్ సెక్రటరీ , కిష్టారం ఓసి ) , పోగుల నాగేశ్వరరావు ( ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ సి.హెచ్.పి ) , అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు , ఆర్గనైజింగ్ సెక్రటరీలు , వివిధ కమిటీ నాయకులు , ముఖ్య నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు....

# పత్తి దిగుబడి తక్కువైంది...కొనుగోలు పరిమాణాన్ని 11 క్వింటాళ్లకు పెంచండి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కు పత్తి రైతుల వినతి
- సంజయన్నా...దేవుడిచ్చిన అన్నవు నువ్వు
- మీ సాయం జన్మలో మర్చిపోలేను
- బండి సంజయ్ ను కలిసి కృతజతలు తారవ్వ

చర్చ :- బ్యూరో కరీంనగర్ :పత్తి కొనుగోలు పరిమాణాన్ని 7 నుండి 9 క్వింటాళ్లకు పెంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ పత్తి రైతులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈరోజు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చిన బండి సంజయ్ ను పత్తి రైతులు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు.వాతావరణ పరిస్థితులు, నీటి సమస్యలు, మార్కెట్ అస్థిరతవల్ల తాము తీవ్రమైన ఇబ్బందులు



ఎదుర్కొంటున్నామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ తరుణంలో ఎకరాకు 7 క్వింటాళ్లను మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐ నిర్ధారించడంవల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పత్తి రైతుల సంక్షేమం కోసం చొరవ తీసుకుని తక్షణమే సీసీఐ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఈ విషయంపై సీసీఐ అధికారులు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

మరోవైపు హుస్నాబాద్ ఆసుపత్రికి వచ్చిన బండి సంజయ్ ను ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పండించిన వడ్లన్నీ కొట్టుకుపోవడంతో కన్నీరు మున్నీరైన రైతు తారవ్వ కలిశారు. తారవ్వకు నష్టం జరిగిందని తెలిసిన వెంటనే బండి సంజయ్ ఆరోజు ఢిల్లీ నుండి తారవ్వకు ఫోన్ చేసి బాధపడొద్దని తక్షణ సాయంగా రూ.50 వేలు పంపిస్తున్నట్లు భరోసా ఇచ్చారు. ఆ మరుసటి రోజే బీజేపీ నేతల ద్వారా తారవ్వకు రూ.50 వేల సాయం అందించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ ను కలిసిన తారవ్వ 'సంజయన్నా...దేవుడిచ్చిన అన్నవు నువ్వు. మీ సాయం జన్మలో మర్చిపోలేను. ఆరోజు పంట నష్టపోయి పుట్టెడు దు:ఖంలో ఉంటే ఫోన్ చేసి భరోసా ఇచ్చినవ్. సాయం చేసినవ్. నువ్వు నిండా నూరేళ్లు సల్లగా ఉండాలి."అని కృతజతలు తెలిపారు.

# అరటి తోట వివాదంలో కత్తులతో దాడి







చర్చ:- అశ్వారావుపేట :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలో ఓ పొలం వద్ద రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ రక్తసిక్తం అయింది.

ఓ ఐదెకరాల పొలంను శ్రీ హరి అనే వ్యక్తి వద్ద నారవారిగూడెం గ్రామానికి చెందిన మంగా వెంకటేశ్వర్లు మంగా గణేష్ అనువారలు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమిలో అరటి తోట కూడా వెయ్యడం జరిగింది. ఈ క్రమంలో అరటి తోట వేసిన భూమి తమదేనంటూ అదే గ్రామానికి చెందిన గేదెల విష్ణు తమ వద్దనున్న ఆధారాలు చూపిస్తున్నారు. రెండు వర్గాల మధ్య పొలం మాదంటే మాదని ఘర్షణ పడుతూ పోలీసులను ఆశ్రయించారు. మూడు నెలలుగా వీరి భువివాదం ఓ కొలిక్కి రాలేదు.ఇరువర్గాలు పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్న తర్వాత గేదెల విష్ణు తన కుమారుడు గేదెల సురేష అరటి తోటను నరికి వేశారని మంగ వెంకటేశ్వర్లు, మంగ గణేష్ లు ఆరోపిస్తూ చేను వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ముందుగానే పొలంలో ఉన్న గేదెల విష్ణు కుటుంబ సభ్యులతో మాట్లాడే క్రమంలో ఇరువర్గాలు ఒక్కసారిగా ఘర్షణ పడ్డారు. కర్రలతో కొట్టుకోవడంతో గొడవ తారస్థాయికి చేరడంతో గేదెల విష్ణు మనవడు గేదెల వినయ్ కత్తితో మంగా వెంకటేశ్వర్లు మంగా గణేష్ పై ఇరువురిపై దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.ఇద్దరి తలలకు గట్టి దెబ్బలు తగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఇద్దరూ కుప్పకూలిపోయారు వెంటనే అక్కడే పడిపోయిన

ఇద్దరినీ హుటా హుటిన అశ్వారావుపేట మండల కేంద్రంలోని ప్రభు త్వాస ుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థి తి విష మంగా ఉండటంతో ఇద్దరినీ ఖమ్మం తరలిస్తున్నారు. ఘ టనపై సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# బీఎస్పీ వెంకటాపురం మండల అధ్యక్షులుగా బొల్లె సతీష్ నియామకం

- బహుజన్ సమాజ్ పార్టీకి ప్రజలు అధికారం ఇవ్వడం ద్వారానే బీసీలకు సామాజిక న్యాయం, అభివృద్ధి జరుగుతుంది - కొండా చరణ్ బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు

చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం :వెంకటాపురం మండలంలోని ఆలుబాక గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆలుబాక సెక్టార్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు ఈ సమావేశం అనంతరం కొండా చరణ్ బీఎస్పీ వెంకటాపురం మండల అధ్యక్షులుగా బీసీ బిడ్డ అయిన బొల్లె సతీష్ ని నియమించడం జరిగింది. బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్ష పదవి లో సతీష్ ని నియమించడం ఎంతో సంతోషకరమైన విషయమని కొండా చరణ్ అన్నారు. వెంకటాపురం మండలంలో బహుజనులైన ఎస్సీ, ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలను ఐక్యం చేసి బహుజన రాజ్యాధికార సాధనకై బహుజన ఉద్యమ అభివృద్ధికై బొల్లె సతీష్ శక్తి వంచన లేకుండా పాటుపడతారని ఆశిస్తున్నామని కొండా చరణ్ తెలిపారు. సతీష్ కుటుంబానికి బహుజన్ సమాజ్ పార్టీ నిరంతరం అండగా ఉంటుందని తెలిపారు.





అగ్రవర్ణ ఆదిపత్య కులాలకు మాత్రమే అధికారాన్ని కట్టపెట్టే విధానం కలిగిన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ఒప్పుకోవడం అసాధ్యం అని ఈ విషయాన్ని బహుజనులైన ఎస్సీ, ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలు గుర్తించాలని తెలిపారు. ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత అనే నినాదంతో పుట్టిన ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని బీసీలను చట్టసభల్లోకి పంపించడం కోసం బీఎస్పీ పుట్టినప్పటినుంచి పనిచేస్తుందని, ప్రస్తుతం ఉన్న 27% బీసీ రిజర్వేషన్లు సాధించడంలో బీఎస్పీ కీలక పాత్ర పోషించిందని, నేటి 42% బీసీ రిజర్వేషన్ పోరాటానికి బీఎస్పీ కట్టుబడి ఉందని, బహుజన్ సమాజ్ పార్టీకి ప్రజలు అధికారం ఇవ్వడం ద్వారానే సామాజిక న్యాయం బీసీల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. బహుజనులైన ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలు బిఎస్పీని ఆదరించాలని, బిఎస్పీ ద్వారా జరుగుతున్న బహుజన రాజ్యాధికార ఉద్యమంలో విస్తృతంగా పాల్గొనాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎక్కేళ్ళ వెంకటేష్ ముక్కెర నిఖిల్ అంకాని పవన్ మేడి శోభన్ బాబు, రేగా నాగేం ద్రబాబు, బొల్లె తరుణ్, సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారక్షణ దళంగా 'జనసేవాదళ్'

- విపత్తులు, ఆపద సమయాల్లో ప్రజలకు అండగా..
- ఎల్డిఆర్ఎఫ్, ఆర్మీ తరహాలో యువతకు శిక్షణ
- సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

చర్చ, కొత్తగూడెం : ప్రజల రక్షణ దళంగా యువతను సిద్ధం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పది కేంద్రాల్లో వాలంటీర్ శిక్షణా తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. రామవరం సాధన క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల స్థాయి వాలంటీర్ జనసేవాదళ్ శిక్షణా తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు ఆలోచన నుంచి పుట్టిందే 'జనసేవాదళ్'అని, విజయవాడ నగరంలో హెచ్చుమీరిన రౌడీ మూకలను అదుపు చేసి



ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించేదుకు 'జనసేవాదళ్'కు అంకురార్పణ చేశారని, ఈ దళం రాష్ట్ర, జాతీయ స్థాయిలో విస్తరించి సేవాకార్యక్రమాల్లో పాల్గొంటోంది గుర్తుచేశారు. జనసేవాదళ్ను ప్రజల రక్షణకు అంకితం చేసే దళంగా మరింతగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలు ఆపదలో ఉన్న సందర్భాల్లో, విపత్తుల సమయంలో ముందుండి సహాయం చేసే విధంగా యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి మండలంలో శిక్షణ పొందిన సభ్యులు ప్రజలకు అండగా నిలిచేలా సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా భారీ బహిరంగ సభ, కవాతును విజయవంతం చేయడానికి భద్రాద్రి జిల్లాలోనుండి 3 వేల మందిని జనసేవాదళ్ దళంగా తయారుచేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో క్రమశిక్షణ, సేవాభావం, విపత్తుల నిర్వహణ, ప్రజా భద్రత వంటి అంశాలను ముఖ్యంగా బోధిస్తున్నామని చెప్పారు. ఎల్డిఆర్ఎఫ్, మిలిటరీ, ఆర్మీ దళాల శైలిలోనే కఠినమైన శిక్షణా విధానాన్ని అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. పార్టీ కార్యక్రమాలు, బహిరంగ సభలు, శాంతి భద్రతల నిర్వహణ కూడా జనసేవాదళ్ బాధ్యతలేనని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు భూక్య శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, యాంద్ర మహేష్, మునిగడప పద్మ, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి శిక్షకులు మురళి, జిల్లా శిక్షకులు భూక్యా శ్రీనివాస్ శిక్షణా తరగతులు నిర్వహించారు.

# సత్తుపల్లిని చుట్టేసిన పొగ మంచు





చర్చ, సత్తుపల్లి : సత్తుపల్లి మండల కేంద్రంలో ఉదయం 5 గంటల నుండి 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు మండల కేంద్రాన్ని చుట్టేసింది. సత్తుపల్లి పట్టణంలో ఉదయం వాకింగ్, చిరు వ్యాపారులు, రోజువారి కూలి పనులకు వెళ్లే వాసులుపై ఈ పొగ మంచు తీవ్ర ప్రభావం చూపింది. ఉదయం ఎనిమిది గంటలు దాటిన గాని పొగ మంచు తగ్గకపోవడంతో ఇళ్లకే పరిమితమై ఉన్న పట్టణవాసులు. ఒకపక్క చలి మరోపక్క పొగ మంచుతో పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడ చలి మంటలు వేసుకొని ఆరోగ్యాన్ని కాపాడే దిశగా పట్టణవాసులు అడుగులు వేస్తున్నారు. చలి, పొగ మంచు వల్ల అనేక అనారోగ్యాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపులు తెలియజేస్తున్నారు.

# పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ కండీషన్‌లో ఉంచుకోవాలి

- ఎస్పీ రోహిత్ రాజు





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, ఇతర అధికారుల వాహనాలను జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు. పోలీస్ వాహనాల రవాణాధికారి ఆర్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఈ తనిఖీలో భాగంగా జిల్లాలోని పోలీస్ డ్రైవర్ల సమస్యలు, విధుల్లో భాగంగా వారి పనితీరును గురించి ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని అన్ని పోలీసు వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచుకోవాలని డ్రైవర్లకు ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖలో డ్రైవర్లుగా పనిచేసే వారు ఖచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడంలో పోలీసు వాహనాల డ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. ప్రతీ డ్రైవర్‌కు తమ వాహన పనితీరు గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. డ్రైవర్లు తమ విధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన తనిఖీల సమయాల్లో తగు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తించేటప్పుడు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పరంగా ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ ఎంటిఓ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలని కలిసిన కల్లూరు ఏసిపి, సబ్ కలెక్టర్



చర్చ, అశ్వారావుపేట: కల్లూరు ఏసీపీగా నూతనంగా నియమితులైన ఐపీఎస్ అధికారి వసుంధర యాదవ్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లు అధికార బాధ్యతలు చేపట్టిన పిదప దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కాసేపు వారితో ముచ్చటించిన తుమ్మల కల్లూరు డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సుభాని కార్టూన్‌కు కలెక్టర్ ప్రశంస




చర్చ, పాల్వంచ:స్థానిక సీనియర్ కార్టూనిస్టు షేక్ సుభాని గీసిన కార్టూన్‌ను ప్రశంసిస్తూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందించారు. విజయవాడలో మల్లెతీగ మాసపత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో కార్టూన్ల ప్రదర్శన జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 275 కార్టూన్లు ప్రదర్శనకు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి పాల్వంచ సీనియర్ కార్టూనిస్ట్ షేక్ సుభాని కూడా పాల్గొనగా ఆయన గీసిన కార్టూన్ పలువురి ప్రశంసలను అందుకుంది. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ లక్ష్మిషా శాలువాతో సన్మానించి, ప్రశంసాపత్రం, మొమెంటో అందచేయడం పట్ల పాల్వంచకు చెందిన పురప్రముఖులు అభినందనలు తెలిపారు.

# జీతాలు రాకపోతే కార్మికులు ఎలా బతకాలి

- ఎమ్మెల్యేలు, ఎంపీలు జీతాలు తీసుకోకుండా ఉంటున్నారా
- ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోటరామాంజనేయులు



చర్చ, సత్తుపల్లి:కల్లూరు మున్సిపాలిటీ లో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను ఆయన నేరుగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే కార్మికుల ఇల్లు ఎలా గడవాలన్నారు . చిరు ఉద్యోగులైన వీరికి వచ్చేది చిన్న జీతాలని, ఆ చిన్న జీతాలను సైతం నెలలు తరబడి చెల్లించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. ఒకవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్న, వీరి జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఆరు నెలల కాలంలో వంటనూనె రేటు మూడుసార్లు పెరిగింది అన్నారు. ఇకపోతే ఆరు సంవత్సరాల కాలంలో రెట్టింపు రేటుతో ప్రస్తుతం 156 రూపాయలుగా ఉందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే కార్మికుల జీతాలు మాత్రం రోజురోజుకి కోతల విధింపబడుతున్నాయన్నారు.. ఈ రకమైన పరిస్థితులు ఏర్పడితే రాబోయే రోజుల్లో దారిద్ర రేఖకు దిగువున ఉండే కార్మికుల సంఖ్య రెట్టింపు అవుతుందని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. ఎంపీలు ఎమ్మెల్యేలు నెలలు తరబడి జీతాలు తీసుకోవడం లేదా అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ఎండి వజీర్ మియా, జిల్లా సమితి సభ్యులు మోదుగు సీతమ్మ, గొల్లమందల యశోద, జీనుగు మణిరాజ్ , చిన్న , అంజలి , సుధాకర్, ప్రకాష్, కట్ట నరసింహారావు, లక్కినేని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మికుల భీమా పెంపు' గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



చర్చ బ్యూరో,భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన భీమా పెంపు వివరణలను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐ డి ఓ సి కార్యాలయం లో 'కార్మికుల భీమా పెంపు' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల భద్రతను బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితులు మరియు అనుకోని మరణాల సమయంలో కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించే దిశగా భీమా మొత్తం పెంపు ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం సమాజమరణ భీమాను రూ.1 లక్ష నుండి రూ.2 లక్షలకు, ప్రమాద మరణ భీమాను రూ.6 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 16.50 లక్షల కార్మికులు లబ్ధి పొందనున్నారని వివరించారు. భీమా ప్రయోజనాలు ప్రతి కార్మికుడికి అందుబాటులో ఉండేందుకు కార్మిక శాఖ, బీమా సంస్థలు మరియు బోర్డులు సమన్వయంతో వేగంగా సేవలను అందించాలని అధికారులకు సూచించారు. భీమా క్లెయిమ్ విధానం, అవసరమైన పత్రాలు, అర్హతలు, టోల్‌ఫ్రీ నంబర్లు వంటి సమాచారాన్ని గ్రామ స్థాయి వరకు విస్తృతంగా చేరేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్మిక కుటుంబాలు ఏ కష్టకాలంలోనైనా ఆర్థికంగా కూలిపోకుండా రక్షించేందుకు ఈ భీమా పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి షర్ఫుద్దీన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర అటవీ పర్యావరణ శాఖల కార్యదర్శిని కలిసిన మంత్రి పొన్నం

- గౌరవెల్లి సహా.. తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు ఇవ్వండి.
- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శిని కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్.



చర్చ:- హుస్నాబాద్ :తెలంగాణలో గౌరవెల్లి సహా. ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని.. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయికుమార్‌ను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సెక్రెటరీ కోఆర్డినేషన్ డా.గౌరవ్ ఉప్పల్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఢిల్లీలో తన్మయికుమార్‌ను కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం మే 2025లో ఇచ్చిన 'వనశక్తి' తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని.. దీనిపై న్యాయసలహా తీసుకొని.. అనుమతుల మంజూరు చేస్తామని తన్మయికుమార్ చెప్పినట్టు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే.. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించినట్టు మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాల్లో ఉన్న కారణంగా.. తన్మయికుమార్‌ను కలిసి.. ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు చెప్పారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష





చర్చ బ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం : పోక్సో కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 1,000 రూపాయల జరిమానాను విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి (పోక్సో స్పెషల్ జడ్జి,అదనపు ఇంచార్జి) ఎస్. సరిత సోమవారం తీర్పును వెలువరించారు. బూర్గంపాడు మండలం,సారపాక గాంధీనగర్ కు చెందిన మైనర్ అమ్మాయిపై అదే గ్రామానికి చెందిన కల్తీ వెంకటేశ్వర్లు అను వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడినట్లు 2020 డిసెంబర్ 12వ తేదీన ఫిర్యాదు అందుకున్న బూర్గంపాడు స్టేషన్ హౌస్ అధికారి బి.బాలకృష్ణ కేసు నమోదు చేశారు.ఇట్టి కేసులో విచారణాధికారిగా అప్పటి సబ్ డివిజన్ పోలీస్ అధికారి కేఆర్కే ప్రసాదరావు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు.కోర్టులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన పిదప నిందితుడు కల్తీ వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కాగా ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు వేయి రూపాయల జరిమానా విధించారు.జరిమానా చెల్లించని యెడల మూడు నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవిడి లక్ష్మీ,కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి.రాఘవయ్య,లైజన్ అధికారి ఎస్.వీరభద్రం,కోర్టు డ్యూటీ అధికారి మహమ్మద్ అక్రమ్ లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## పేదమహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణి పథకం ప్రసంశనీయం

- అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి
- అభివృద్ధిలో కొత్తగూడెం నియోజకవర్గం ఆదర్శంగా నిలిచింది
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- పేద గ్రామీణ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణి చేసిన ఎమ్మెల్యే





చర్చ, చుంచుపల్లి/సుజాతనగర్ : నిరుపేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణి పథకం ప్రసంశనీయం, గత ప్రభుత్వానికి భిన్నంగా నాణ్యమైన చీరలు అందించి పేదమహిళల సామాజిక గౌరవం పెంపొందే దిశగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండల గ్రామీణ మహిళలకు ఎన్ కే నగర్ కమ్మ కల్యాణ వేదికలో ఇందిరమ్మ చీరలు అందించారు. సుజాతనగర్ మండల గ్రామీణ మహిళలకు మండలంలో రైతువేదికలో చీరలు పంపిణి చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలు మోసే మహిళలను గౌరవిచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన వంటి అంశాలను ప్రభుత్వం ఇంకా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధిలో కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతున్నామని, ప్రతి పల్లె, బస్తీలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులైన రోడ్లు, విద్యుత్తు, త్రాగునీరు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తిచేశామని, భారీ తరహా ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి చోటులేకుండా పారదర్శకంగా అమలుచేస్తున్నామని తెలిపారు. మునుపెన్నడూ లేనివిధంగా నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా, ఆర్డీవో మధు, చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణ, లక్ష్మిదేవిపల్లి తహసీల్దార్ శిరీష, నాయకులు వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మండే హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు మానపతి ముచ్చట్లు మానుకోవాలి

- కొండా చరణ్ బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షులు



చర్చ బ్యూరో,భద్రాద్రి కొత్తగూడెం :చర్ల మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది బిఎస్పి భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండ చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు మానపతి ముచ్చట్లు మానుకోవాలని, భద్రాచలం నియోజకవర్గ ప్రజలు ఇంకా మీ మాయమాటలు నమ్మే పరిస్థితిలో లేరని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండే ఇసుక దోపిడీ మొదలైందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు భద్రాచలంలోని కరకట్టను ఎందుకు ఆధునికరించలేదో బిఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని, భద్రాచలం రాములోరి గుడి అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నపుడు ఇస్తానన్న 100 కోట్లు నిధులు ఎందుకు ఇవ్వలేదో, వరదల సహాయక చర్యల్లో భాగంగా భద్రాచలం నియోజకవర్గంకై నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తానన్న 1000 కోట్లు నిధులు ఎందుకు ఇయ్యలేదని, ప్రశ్నించారు. వలస ఆదివాసుల బ్రతుకులపై దెబ్బ కొట్టింది బిఆర్ఎస్ కాదా? అని సీతమ్మ సాగర్ పేరుతోటి కరకట్ట నిర్మాణం మొదలుపెట్టి కోరేగడ్డ భూములను నీట ముంచి, గోదావరి పరివాహక ప్రాంత బిడ్డల జీవనోపాధిని నాశనం చేయ జూసింది బిఆర్ఎస్ కాదా? అని, పదేళ్ల పరిపాలనలో చర్ల మండలంలో డిగ్రీ కాలేజీని ఎందుకు నిర్మించ లేదని, ఫైర్ స్టేషన్ ఎందుకు నిర్మించలేదని, ప్రశ్నించారు. భద్రాచలం నియోజకవర్గం ప్రజలు బిఆర్ఎస్ మాయ మాటలు ఇక నమ్మే పరిస్థితులు లేరని అన్నారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లుగా నిరంతరం ఎన్నికల్లో దొంగ హామీల వర్షం కురిపిస్తూ పోటీ పోటీగా ప్రజలను ఈ రెండు పార్టీల నాయకులు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తు రాములోరిని మోసం చేసిన బిఆర్ఎస్ కు భద్రాచలం గడ్డపై ఓటు వాడికి హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ ల కుటిల రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. నిరంతరం బహుజనుల అభివృద్ధి కోసం, సమాజంలో సామాజిక న్యాయం నెలకొల్పడం కోసం ఎవరు ఎంతో వారికంత వాటా దక్కాలని, గొప్ప లక్ష్యం తోటి పనిచేస్తున్న బీఎస్పీకి అధికారం ఇవ్వడం ద్వారానే భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి అవుతుందని, ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్లను చిత్తుచిత్తుగా ఓడించాలని, బీఎస్పీని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాములోరిని మోసం చేసిన దుర్మార్గపు ప్రభుత్వం నాటి బిఆర్ఎస్1000 ప్రభుత్వమని,పదేళ్ల పరిపాలనలో చర్ల మండలంలో డిగ్రీ కాలేజీని ఎందుకు నిర్మించ లేదో బిటిఆర్ఎస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో చర్ల మండల అధ్యక్షులు పడిగల వెంకట్, చర్ల మండల ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, చర్ల మండల కార్యదర్శి గుర్రాల విజయ్ కుమార్, చర్ల మండల కోశాధికారి ఎస్కే జహీరుద్దీన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిపై ఫిర్యాదు



చర్చ:- హుస్నాబాద్ : సోమవారం రోజున ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరిగింది హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న అధికారి అవినీతిపైన వారు ఇచ్చినటువంటి పర్మిషన్లపై విజిలెన్స్ మరియు జిల్లా అధికారులు సమక్షంలో విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ తవ్వ వేణుగోపాల్ రెడ్డి సోమవారం రోజున ప్రజావాణి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరిగింది ఈ టి పి ఎస్ వచ్చినప్పటి నుండి ప్రభుత్వ భూముల్లో మరియు అక్రమ కట్టడాలు సెట్ బ్యాక్ లేకుండా కడుతున్న బిల్డింగులు మరియు బహుళ అంతస్తుల భవనాలు ప్రభుత్వ నిబంధనలేని రియల్ ఎస్టేట్ వ్యాపారుల నిర్వహిస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోవడం లేకపోవడంతో పాటు వారి వద్ద నుండి లక్షలాది రూపాయలు తీసుకొని ప్రభుత్వ ధనాన్ని గాని దుర్వినియోగం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న అధికారిపై శాఖా పరమైన మరియు విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ప్రజావాణి కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది ఒక నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చే ముందు ఇది ప్రభుత్వ భూమి లేక సొంతదారదేనని విచారణ జరిపించకుండా డబ్బులు ఇస్తే అవినీతికి పాల్పడి ప్రభుత్వ భూముల యందు కూడా పాత పర్మిషన్లతో చూసుకొని కొత్త పర్మిషన్లు ఇవ్వడం జరిగింది అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండదండలుగా ఉంటూ నాలా మరియు లేఔట్ లేకున్నా కూడా ఇష్టానుసారంగా వారి దగ్గర నుండి లక్షల రూపాయలు తీసుకొని ఎవరు కూడా ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు ఇవ్వనటువంటి రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూముల యందు రోడ్డు వారు పెట్టినటువంటి ఖనిలు తొలగించడం జరిగింది అలాగే అక్రమంగా కట్టిన ఇండ్లకు విద్యుత్ పరిమిషన్లు నెట్ బ్యాక్ లేకుండా కట్టిన ఇండ్ల వద్ద నుండి 50 వేల నుండి లక్ష రూపాయలకు డిమాండ్ చేస్తూ ఉండడం జరుగుతుంది ఈ అవినీతి అధికారి ద్వారా హుస్నాబాద్ పూర్తిగా అవినీతిమయంలో మున్సిపల్ శాఖ కార్యాలయం ఉన్నది వీటిని పైన విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణి యందు ఫిర్యాదు చేయడం జరిగింది వీటి అన్నిటిపై విచారణ జరిపించకుంటే ప్రజా సమాచార చట్టం ద్వారా ప్రజా వాణి యందు ఫిర్యాదు చేస్తామని తెలియజేయడం జరిగింది

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు

- ఇబ్బందులు పడుతున్న పాదచారులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- పట్టింపులేని పంచాయతీ అధికారులు





చర్చబ్యూరో, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రీయ రహదారికి ఇరువైపులా పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను పలువురు వ్యాపారస్తులు ఆక్రమించడంతో పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ ఏ చిన్న స్థలం కన్పించినా వెంటనే ఆక్రమించేసి టీ కొట్లు, బడ్డీ కొట్లు, టిఫిన్ సెంటర్లు, జ్యూస్ పాయింట్లు ఇతరత్రా వాటిని ఏర్పాటు చేసేస్తున్నారు. ముఖ్యంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులు వేస్తున్న జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో ఫుట్‌పాత్‌లు ఉన్నాయా లేదా అనే అనుమానం కలుగుతోంది. పోస్టాఫీస్ సెంటర్ నుంచి మొదలుకొని విద్యానగర్ కాలనీ బైపాస్‌రోడ్ వరకు కూడా 100 మీటర్ల రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు కనుమరుగయ్యాయి. ప్రధాన డ్రెయినేజీతోపాటుపైకప్పును ఆక్రమించిన పలువురు బడా వ్యాపార సంస్థల వారు వ్యాలెట్ పార్కింగ్ కౌంటర్‌లను ఏర్పాటు చేయగా, చిన్న చిన్న షాపుల వారు ఫుట్‌పాత్‌లపై బోర్డులు ఏర్పాటు చేసుకోవడం, వారి వ్యాపార సంస్థకు చెందిన వస్తువులను వాటిపై పెట్టడంతో మొత్తం బ్లాక్ అయిపోతుంది. దీంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోంది. చివరకి ద్విచక్ర వాహనాలను కూడా పార్కింగ్ చేసుకునే పరిస్థితి లేదు. వాహనాలన్నీ రోడ్లపైనే నిలపవడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రహదారిలో ఖమ్మం నుంచి కొత్తగూడెం మీదుగా భద్రాచలం, మణుగూరు వంటి ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు, బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అదేవిధంగా ఆయా ప్రాంతాల నుండి ఖమ్మం వైపునకు వెళ్లే వాహనాల సంఖ్య భారీగానే ఉంటుంది. ఫుట్‌పాత్‌లు పూర్తిగా కనుమరుగు కావడంతో పాదచారులు రోడ్లపై నడవడం వల్ల భారీ వాహనాలు వేగంగా వెళ్లిన సందర్భాల్లో పలువురు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ రహదారి వెంబడి పోలీసుల ట్రాఫిక్ నియంత్రణ కూడా లేకపోవడం కారణంగా ద్విచక్రవాహనదారులు అధిక వేగంతో వెళ్తూ పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

### నిద్రమత్తులో పంచాయతీ అధికారులు

మేజర్ గ్రామ పంచాయతీ, మండల కేంద్రం అయిన విద్యానగర్ కాలనీ, చుంచుపల్లి ప్రాంతాల్లో ప్రధాన రహదారుల వెంబడి ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు పంచాయతీ సిబ్బంది ఆయా వ్యాపారస్తుల వద్ద నుండి మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు కూడా విన్పిస్తున్నాయి. వారి నిర్లక్ష్యం కారణంగా పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్ల వెంబడి నడవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, పాదచారులు డిమాండ్ చేస్తున్నారు.

### ఫిర్యాదులు వచ్చాయి.. నోటీసులు ఇస్తాం- పంచాయతీ కార్యదర్శి.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ని 'చర్చ' ప్రతినిధి వివరణ కోరగా ఈ విషయమై ఇప్పటికే పలువురు ఫిర్యాదులు చేశారని చెప్పారు. తొలుత వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చి, అప్పటికీ వారు స్పందించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఏడవ రోజుకు చేరిన నిరసన దీక్ష


- భూస్వాముల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల లెక్కలు తేల్చాలి
- డిమాండ్ చేస్తున్న సిపిఐ




చర్చ బ్యూరో,భద్రాద్రి కొత్తగూడెం :అశ్వరావుపేట సర్వే నెంబర్ 1228 లో ప్రభుత్వ భూములో పేద ప్రజలు నిర్మించుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చేసిన అమానవీయ చర్యకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఏడవ రోజుకు చేరింది. పాలకులు, అధికారులు దిగివచ్చి నష్టపోయిన పేద ప్రజలకు న్యాయం చేయాలని చేపట్టిన ఈ దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు మద్దతు తెలియజేస్తూ సిపిఐ, పేద ప్రజలు చేసే పోరాటం లో వారికి మద్దతుగా తామందరం నడుస్తామని తెలియజేశారు. అశ్వరావుపేటలో భూస్వాముల ఆధీనంలో కొన్ని వందల ఎకరాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు కష్టపడి గుడిసెలు నిర్మించుకొని 5,6 సంవత్సరాలుగా నివసిస్తున్న తరుణంలో వాటిని కూల్చేయడం క్రూరమైన చర్యగా వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పాలకులు, అధికారులు ఇప్పటికైనా మేల్కొని నష్టపోయిన ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించి, వారికి నష్టపరిహారాన్ని ఇవ్వాల్సిందిగా సిపిఐ పార్టీ శ్రేణులు, బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నాయి. అశ్వరావుపేటలో భూస్వాములు ఆధీనంలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి లెక్కలు తేల్చకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టి ముందుకు తీసుకువెళతామని సిపిఐ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం విలేకరులతో మాట్లాడుతూ గత 5,6 సంవత్సరాలుగా సర్వేనెంబర్ 1228 లోని ప్రభుత్వ భూములో పేద ప్రజలు అడవి నరికి, గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తూ వస్తున్నారు. అట్టి ప్రజల ఇళ్లను దౌర్జన్యంగా ఎటువంటి సమాచారం లేకుండా ప్రభుత్వం, అధికారులు, పోలీసులు కూల్చేయటం దుర్మార్గపు చర్య అని, ఒకపక్క ప్రభుత్వం పేద ప్రజలు ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకుంటే వాటిని తొలగించవద్దని చెబుతున్న, అశ్వరావుపేట కాంగ్రెస్ నాయకులు దానిని పక్కనపెట్టి వారికి ఇష్టారాజ్యంగా పేదల ఇళ్లను కూల్చి వేస్తూ, పేదలపై ఇష్టారాజ్యంగా దౌర్జన్యానికి తెగబడుతున్నారు. అశ్వరావుపేట కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరినే మార్చుకోవాలి అని, ప్రజలను ఇలా కష్టపెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, నష్టపోయిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# చచ్చిపోయేంతవరకు ఆయన సూత్రానే పాటిస్తాను

- 9 నెలలలో అధికారం తెచ్చినమహానీయుడు
- పద్మశ్రీ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు







చర్చ, సత్తుపల్లి:మట్టి పిసికే సామాన్య రైతు బిడ్డనైనా తనకు చట్టసభల్లో అవకాశాన్ని కల్పించిన రాజకీయ గురువు, మహనీయుడు పద్మశ్రీ ఎన్టీ రామారావు తాను చచ్చిపోయే వరకు ఆయన సూత్రాన్ని పాటిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.కల్లూరు మండలం చిన్నకోరుకోండి గ్రామపంచాయతీ ధారుక బంజర గ్రామంలో ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీనియర్ జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వర్గీయ పద్మశ్రీ నందమూరి తారక రామారావు తో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేశారు.తనను అభిమానించే తెలుగు ప్రజల కోసం తెలుగు గడ్డ, నేల, జాతి ఉన్నతి కోసం రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి తొమ్మిది నెలల కాలంలోనే రాజకీయ చరిత్రను మలుపు తిప్పి అధికారంలోకి వచ్చి దేశానికి ప్రపంచానికి తెలుగు నేలను పరిచయం చేసిన కారణజన్ముడు, తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి పద్మశ్రీ నందమూరి తారక రామారావు అని కొనియాడారు.ఎన్టీఆర్ చల్లని చూపుతో మట్టి పిసికి వ్యవసాయం చేసే రైతు కుటుంబంలో పుట్టిన సామాన్యుడైన తనకు చట్టసభల్లో అవకాశం కల్పించారని, నిబద్ధతతో నిజాయితీతో పని చేస్తానని ఆయనకు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి అప్పటినుండి ఇప్పటివరకు పనిచేస్తున్నానని అన్నారు.ఇప్పటి రాజకీయాలు వైవిధ్యమైన, కలంకమైన, అవినీతిమయమైన, కుచితమైనవిగా విమర్శిస్తూనే ఇలాంటి రాజకీయాల్లో తాను ఎన్టీఆర్ సూత్రాన్ని పాటిస్తూ ప్రజల అభివృద్ధి కొరకు పాటు పడుతూ నిస్వార్ధంగా సేవ చేస్తూ ఎన్టీఆర్, ప్రజల ఆశీర్వాదంతో బతుకుతున్నానన్నారు. నియోజకవర్గ, జిల్లా , రాష్ట్ర, దేశ అభివృద్ధి కోసం ఎన్టీఆర్ మాట తూచా తప్పకుండా పనిచేస్తున్న తనకి ఎన్టీఆర్ శిష్యుడు ఎవరంటే తుమ్మల నాగేశ్వరరావు అనే స్థితికి ప్రజలు, ఎన్టీఆర్ అవకాశం కల్పించారన్నారు. ఏ రోడ్లు వేసిన, నీళ్లు ఇచ్చినా అది తెలుగుదేశం పార్టీనే చేసింది ఎన్టీ రామారావు పార్టీ ఉన్నప్పుడే ఈ నియోజకవర్గంలో అడుగడుగునా,అనువణువునా ప్రజలకు కొరత లేకుండా చేసిన ఘనత నాకు దక్కింది అని తెలుపుతూ తనకు రామారావు తర్వాత సుదీర్ఘకాలం పనిచేసే అవకాశాన్ని చంద్రబాబు నాయుడు కల్పించారన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.స్థలదాతకు అభినందనలు....దారుక బంజరుకు చెందిన మానవతావాది మనసున్న వ్యక్తి సీనియర్ నాయకులు ఉయ్యూరు నాగేశ్వరావు ను అభినందించారు. పద్మశ్రీ ఎన్టీఆర్ విగ్రహం నిలబెట్టడం కొరకు స్థలం కోసం పరిశీలిస్తున్నప్పుడు నా స్థలాన్ని విగ్రహ ఏర్పాటుకు ఇస్తానని ఉయ్యూరు నాగేశ్వరావు ముందు రావడంతో ఈరోజు ఆ మహానీయుడు విగ్రహాన్ని ఆవిష్కరించడానికి అవకాశం కలిగిందని గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ లెజిస్టేటివ్ కమిటీ సభ్యులు జనార్ధన్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమై దయానంద్, ఇరిగేషన్ రాష్ట్ర చైర్మన్ మువ్వా విజయబాబు, ఆంధ్రప్రదేశ్ దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు రామనాథం, జిల్లా కార్యదర్శి కేతినేని హరీష్ ,తెలుగు యువత జై రావు రమేష్, ఎఎంసి చైర్మన్ బాగ%శీ% నీరజ ప్రభాకర్ చౌదరి,విగ్రహ కమిటీ నాయకులు ఎస్కే ఖాదర్, రామకృష్ణ, మండల అధ్యక్షులు పొట్రు శ్రీనివాసరావు, సీనియర్ జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు, కాకర్ల రంగారావు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడ్డీ లేని రుణాల పంపిణీని ఘనంగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, సమగ్ర సమన్వయంతో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి బట్టి మల్లు విక్రమార్క కలెక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 3.50 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.304 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని, ముందస్తుగా సమాచారం అందించి సమన్వయాన్ని బలోపేతం చేయాలని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు సూచించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాల పథకాన్ని విస్మరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థిక సాధికారత కోసం ఈ పథకాన్ని మరోసారి విస్తృతంగా పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేసినట్లు, నేడు మరోసారి పెద్ద ఎత్తున ఈ రుణాలను అందించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు అత్యంత విజయవంతంగా నిర్వహించారని ప్రశంసిస్తూ, నాణ్యమైన చీరలను అందుకున్న మహిళలు వ్యక్తపరిచిన ఆనందాన్ని గుర్తుచేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసి కార్యాలయం సమావేశం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లాకలెక్టర్ జితేష్ వి. పాటిల్**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో మాట్లాడుతూ అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలను అత్యంత శ్రద్ధతో, సమయపాలనతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు ఈ రుణాల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమంగా ఉన్నందున ఏ శాఖ ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని తక్షణం పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలం, ప్రతి గ్రామానికి చీరలు వేగంగా చేరేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పరిస్థితిపై, నిర్మాణంలో ఉన్నవి, పూర్తైనవి, కేటాయించినవి.. పూర్తి వివరాలతో నివేదికలను వెంటనే సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఈ ఇండ్ల కేటాయింపులు పేదలు, నిజంగా అవసరం ఉన్న నిరుపేద కుటుంబాలకు మాత్రమే అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్ సహా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి కోటి విలువైన ఎక్విప్ మెంట్ ను అందించిన కేంద్రమంత్రి బండి సంజయ్





చర్చ:- హుస్నాబాద్:ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు కూడా మందు అందుబాటులో లేని దుస్థితి నెలకొందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "సర్కార్ ఆసుపత్రులకు వచ్చే వాళ్లంతా పేద, ఆసుపత్రికి ఇంకా ఏమేం కావాలో చెప్పండి. అన్ని సౌకర్యాలను సమకూరుస్తా. ఈ ఆసుపత్రికి వచ్చే వాళ్లంతా పేదలు, మధ్య తరగతి వాళ్లే. ఆర్థికంగా లేనివాళ్లే. అట్లాంటి వాళ్లను టెస్టుల్లేవనో, సూది మందు లేదనో ప్రైవేట్ ఆసుపత్రికి పంపి వారిపై భారం మధ్య తరగతి ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్రీట్ మెంట్ చేసుకోలేని వాళ్లే. సూది మందుతోపాటు కనీస సౌకర్యాల్లేక పోతే పేదల పరిస్థితి ఏంది? చావాల్సిందేనా?" అని ప్రశ్నించారు. ఇకపై ఇక్కడికి వచ్చే రోగులెవరూ ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే దుస్థితి రానీయొద్దని, అందుకోసం తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను, సాయాన్ని అందించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. "ఇకపై ఒక్క పేషెంట్ కూడా ట్రీట్ మెంట్ కోసం బయటకు వెళ్లే పరిస్థితి రానీయొద్దు. ఈ మోపొద్దు. పేదలకు సేవ చేయడం మహా భాగ్యం. మానవ సేవే మాధవ సేవ అని గుర్తుంచుకుని సేవలందించండి."అని కోరారు.ఈరోజు కేంద్ర మంత్రి బండి సంజయ్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఎన్ ఎండీసీ సంస్థ సహకారంతో సీఎస్సార్ నిధులతో దాదాపు రూ.కోటి విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. ఇందులో ఈసీజీ మిషన్లు, అల్ట్రాసౌండ్ మిషన్, ఈఎన్టీ సర్జికల్ మైక్రోస్కోప్, మల్టిపుల్ మానిటర్స్ మార్చురీ కేబినెట్ సహా మొత్తం 15 రకాల వైద్య పరికరాలను (మెడికల్ ఎక్విప్ మెంట్స్) ఉన్నాయి. ఆ సేవలను ఈరోజు బండి సంజయ్ ప్రారంభించారు. ఆయా పరికరాల ద్వారా అందించే సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం రోగులను కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లతో సమావేశమై ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.విద్య, వైద్య రంగాలకు సంబంధించి పేదలకు పూర్తిస్తాయిలో సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ దురద్రుష్టవశాతు ఇయాళ ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడికి వచ్చే రోగులకు సూదుల్లేవు, మందుల్లేవు, టెస్టులు చేయడానికి పరికరాల్లేవు. ఇయాళే వార్తలు చూసిన. కుక్క కాటుకు మందు కూడా లేదని వార్తలొస్తున్నాయి. అట్లయితే పేదల పరిస్థితి ఏంది చనిపోవాలి ్సిందేనాఅని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వాళ్లంతా పేదలు, మధ్య తరగతి ప్రజలే. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేరనే సంగతిని గుర్తుంచుకోవాలి. వాళ్లకు సరైన వైద్యం అందించాల్సిన బాధ్యత ఇక్కడి డాక్టర్లు, సిబ్బందిపై ఉంది. కేంద్ర నిధులతోనే దాదాపు సర్కార్ ఆసుపత్రులన్నీ నడుస్తు న్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పెద్ద ఎత్తున వస్తున్న నిధులు వస్తున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయి ంలో నిధులు ఇవ్వకపోవడంవల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంద ులకు, సూది, కాటన్, ఇతర చిన్న చిన్న మెడికల్ పరికరాల కొన ుగోలు చేయలేక ఇబ్బందులు వస్తున్నాయి. వీటిని ద్రుష్టిలో పెటు ్టకునే నా పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ ఇబ్బందుల్లేకుండా సంస్థ సహకారంతో సీఎస్సార్ ఫండ్స్ తో ఈ మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను కొనుగోలు చేసి ప్రభుత్వ ఆసుపత్రులకు అందించడం జరిగింది.

## మత్తు పానీయాల నిర్మూలనలో విద్యార్థులదే కీలక పాత్ర



చర్చ, సత్తుపల్లి:మండల పరిధిలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలోని యు.పి.ఎస్ పాఠశాలలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగ నిర్మూలన కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన సహచరులకు మారకద్రవ్యాల వలన ఏర్పడే దుష్ప్రభావాలను తెలియజేసి వాటి వినియోగాన్ని తగ్గించే విధంగా విద్యార్థులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థి ఉన్న ఇంట్లో మారకద్రవ్యాల వినియోగం ఉండకూడదని, ఆ దిశగా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఝాన్సీ నిర్మల కుమారి, జ్యోత్స్న ఎం.ఎల్.హెచ్.పి, సుమతి ఏ.ఎన్.ఎం, ఆశా వర్కర్లు సుజాత, మల్లీశ్వరి పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.ం

## ఇందిరా మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ



చర్చ, సత్తుపల్లి:మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశానుసారం గ్రామ పెద్దలు కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు చేతులమీదుగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల కళ్ళల్లో ఆనందం చూడడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి చేనేత చీరలు అందించారని, మహిళల సాధికారత కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మునుపటి కంటే మెరుగైన చీరలు..రేవంత్ సర్కార్ గత మూడు రోజులుగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరల పట్ల మహిళలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సమయ భావంతో చీరల పంపిణీ కొంత ఆలస్యమైనప్పటికీ నాణ్యమైన చేనేత చీరలు అందించారని, గతంలో అందించిన చీరలకంటే మెరుగైన వాటిగా మహిళలు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్త లక్ష్మి, వి.వో.ఏ లు పానెం.ధనలక్ష్మి, జి.రాజేశ్వరి, పాగా.జమలమ్మ, లక్ష్మి కృష్ణ ఎస్.హెచ్.జి, సూర్య ఎస్.హెచ్.జి, ఆకాంక్ష ఎస్.హెచ్.జి, లక్కీ ఎస్.హెచ్.జి మహిళలు పాల్గొన్నారు.

## నగరంలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులు షాపుల ట్రేడ్ లైసెన్స్ పన్నులు




చర్చ :- కరీంనగర్ :నగరంలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులు షాపుల ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధి కి సహకరించాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం రోజు మార్కెట్ ప్రాంతంలో అధికారులతో కలిసి ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్ ను తనిఖీ చేసి పరిశీలించారు. నగరపాలక సంస్థ కు చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్స్ పన్నుల బకాయిలను చెల్లించాలని షాపు యజమానులకు సూచించారు. వ్యాపారం చేసే షాపులకు నగరపాలక సంస్థ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ను తప్పక పొందాలని... ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసి ఉంటే పొందాలని సూచించారు. మరో వైపు నగర వ్యాప్తంగా ట్రేడ్ లైసెన్స్ పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. కొత్త ట్రేడ్ లైసెన్స్ కట్టించేలా చర్యలు తీస్కోవాలని అధికారులను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చెట్లను తొలగించిన ఎస్సై లక్ష్మారెడ్డి



చర్చ:- హుస్నాబాద్:రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు మీదకి వచ్చిన చెట్లను తొలగింపు చర్యలు చేపడుతున్నట్టు హుస్నాబాద్ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.సోమవారం, మండలంలోని పోతారం(ఎస్) – మీర్జాపూర్ రోడ్డులో రోడ్డు మార్గానికి అడ్డుగా, ప్రమాదకరంగా పెరిగిన చెట్లను ట్రాక్టర్, పోలీస్ సిబ్బంది సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రోడ్డు పక్కన పెరిగిన చెట్లు గుబురుగా తయారై, ఎదురుగా వచ్చే వాహనాలు వాహనదారులకు కనిపించకపోవడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ ప్రమాదాల తీవ్రత అధికమైతే మృత్యువాత పడుతున్నారు. వాహనం నడిపే సమయంలో మద్యం సేవించకూడదు అన్నారు. ఆటోల్లో ప్రయాణికులను పరిమితికి మించి తరలించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మొగిలినాయక్,కానిస్టేబులు సంపత్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శిక్ష తప్పదు పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి హెచ్చరిక..










చర్చ,గోదావరిఖని:పెద్దపల్లి డీసీపీ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా సోమవారం గోదావరిఖని సబ్ డివిజన్ , వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లను డీసీపీ భూక్య రాంరెడ్డి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణం స్పందించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో అత్యధిక నేరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతుల వివరాలను సంబంధిత సెక్టార్ ఎస్.ఐ లను అడిగి తెలుసుకున్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. నేరాల నియంత్రణకు పట్టణంలో నిరంతరం పెట్రొలింగ్ నిర్వహించాలని సూచించారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్,వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్ఐ లు భీమేష్, రమేష్, అనూష, ఉన్నారు.

# రౌడీషీటర్లు అలా చేస్తే కఠిన చర్యలు



**హైదరాబాద్, నవంబరు 24 :** నగరంలో రాత్రివేళల్లో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది ఎలా స్పందిస్తున్నారనే విషయాన్ని తాను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆకస్మిక పర్యటనలు చేస్తున్నానని పేర్కొన్నారు. పీపుల్ వెల్ఫేర్ పోలీసింగ్‌లో భాగంగా చేపడుతున్న ఈ పర్యటనలు పోలీసు సిబ్బంది బాధ్యతా భావాన్ని పెంపొందించడమే కాకుండా, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాయని చెప్పుకొచ్చారు సీపీ సజ్జనార్.ఆదివారం) అర్ధరాత్రి సౌత్ వెస్ట్ జోన్‌లో సీపీ సజ్జనార్ ఆకస్మిక పర్యటన చేశారు. రాత్రి 12:00 గంటల నుంచి 3:00 గంటల వరకు లంగర్‌హౌస్, టోలిచౌకి పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులు, కీలక ప్రాంతాలు, సున్నితమైన పాయింట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. సైరన్, ఎలాంటి ఆర్భాటం లేకుండా ఆ వాహనంలోనే లంగర్ హౌజ్ పీఎస్ పరిధిలోని ఎండీ లైన్స్, ఆశాంనగర్, డిఫెన్స్ కాలనీల్లోని రౌడీ షీటర్ల ఇళ్లకు నేరుగా వెళ్లారు. ఇంట్లోనే ఉన్న రౌడీ షీటర్లను నిద్రలేపి వారి నేర చరిత్ర, ప్రస్తుత జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. మళ్లీ నేరాల వైపు అడుగులు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర ప్రవృత్తి వీడి సన్మార్గంలోకి రావాలని హితవు పలికారు సీపీ సజ్జనార్.అలాగే, టోలిచౌకి పరిధిలో రాత్రిపూట తెరిచి ఉన్న హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల్లోకి వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళల్లో షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు.పెట్రోలింగ్ సిబ్బంది ఎంతమేర అప్రమత్తంగా ఉన్నారు, రాత్రి వేళల్లో ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారనే అంశాలపై క్షేత్రస్థాయిలో నేరుగా ఆరా తీశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు, అధికారులను స్వయంగా కలుసుకుని, గస్తీ పాయింట్లు, తదితర సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు సీపీ సజ్జనార్. అనంతరం. టోలిచౌకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి. స్టేషన్ జనరల్ డైరీ, నిన్న రాత్రి చేసిన ఎంట్రీలు, డ్యూటీలోని సిబ్బంది హాజరు వివరాలు, వారికి అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. నగరంలో నేరాలపై కఠినమైన పర్యవేక్షణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి త్వరితగతిన స్పందించే విధంగా పోలీసు బృందాలు సిద్ధంగా ఉండాలని సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు.

# అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్: తలసాని




**హైదరాబాద్, నవంబరు 24:** అభివృద్ధికి కేరాఫ్‌గా సనత్‌నగర్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు.(సోమవారం) సనత్‌నగర్‌లోని బీకే గూడలో గల సీనియర్ సిటీజన్స్ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు పైబడిన 34 మంది, 70 సంవత్సరాలు పైబడిన 32 మంది సీనియర్ సిటీజన్స్‌ను శాలువాలతో సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. తమ వయసు సైతం లెక్క పెట్టకుండా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా సీనియర్ సిటీజన్స్ నిలుస్తున్నారని ప్రశంసించారు. 2014లో తాను సనత్‌నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సౌకర్యార్థం ఓ కార్యాలయం నిర్మించి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఉండాల్సిన సమయంలో సమాజానికి సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఒక కమిటీగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమా లకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని, ఇక ముందు కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. సనత్‌నగర్ నియోజకవర్గంలో 2014 తర్వాతనే పెద్ద ఎత్తున అభి వృద్ధి పనులు జరిగాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపెట్టామని చెప్పుకొచ్చారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్య మంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి హయాంలో కూడా సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువగా అభివృద్ధి పనులు జరగ లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షులు పార్థసారధి, మానిక్ రావ్ పాటిల్, సభ్యులు అనంతరెడ్డి, కృష్ణ దేవ్‌గౌడ్, సాయి, నాయకులు కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల కోసమే మహిళలకు ముతక చీరలు




**మహబూబ్‌నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. దమ్ముంటే పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలని సవాల్ విసిరారు. నారాయణపేటలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలకుదిక్కులేక కేంద్రం నిధుల కోసం కక్కుర్తి పడుతున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలునిర్వహి స్తోందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే సర్పంచుల పదవీకాలం పూర్తికాగానే ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేతకానితనం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్లు పంచాయతీల నిధులు ఆగిపోయాయని వెల్లడించారు. ఆ నిధుల కోసమే కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తోందిని అన్నారు.గందరగోళంగా.. రిజర్వేషన్లు ఎన్నికల కోసం కాంగ్రెస్ తీరు చూస్తే నవ్వొస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు, 2024 సర్వే ప్రకారం వార్డ్ మెంబెర్స్ రిజర్వేషన్లు నిర్వహించడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అన్నారు . పార్టీ గుర్తులపై సర్పంచులు గెలవరు. అలాంటప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్స్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు.ఏ రకంగానైనా సర్పంచ్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలంటూ తాయి లాలు ప్రకటిస్తుందని విరుచుకు పడ్డారు. దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు ఇస్తున్నన్నారని ప్రశ్నిం చారు. పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ కావాలా. కాంగ్రెసోళ్ళు ఇచ్చే ముతక చీరలు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌కు రోడ్లు వేసుకుంటే హైదరా బాద్ , సికింద్రాబాద్‌లా మారిపోయినట్లేనా నని నిలదీశారు. జిల్లా వాసికి ముఖ్యమంత్రి అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజలకు ఒరిగింది ఏమిలేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చే నిధులతోనే రాష్ట్ర ంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగు తున్నాయని పేర్కొన్నారు.

# రూ. 29,500 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన




**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జరిగిన "మధ్యప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలు" వ్యాపార సదస్సు సందర్భంగా యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 29,500 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనను సమర్పించింది. ఈ సదస్సులో మధ్యప్రదేశ్ ప్రభుత్వం అందుకున్న రూ. 36,600 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలో ఇది అత్యధికం.ఎంపీ పెట్టుబడి ప్రవాహానికి అత్యధిక సహకారంయాక్సిస్ ఎనర్జీ ప్రతిపాదన, ఈ సదస్సులో సమర్పించబడిన అతిపెద్ద పెట్టుబడి ప్రతిపాదనలలో ఒకటి, భారతదేశంలో క్లీన్ ఎనర్జీ మౌలిక సదుపాయాలను విస్తరించాలనే కంపెనీ దీర్ఘకాలిక లక్ష్యంను ఇది పునరుద్ఘాటిస్తుంది.ఆర్థిక వృద్ధి మరియు ఉపాధిని మెరుగుపరచడంఈ కార్యక్రమంలో ప్రకటించిన పెట్టుబడి ప్రతిపాదనలు వివిధ మధ్యప్రదేశ్%-%హైదరాబాద్ బిజినెస్ మీట్‌లో రూ. 29,500 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనను సమర్పించిన యాక్సిస్ ఎనర్జీరంగాలలో సుమారు 27,800 మందికి ఉపాధిని కల్పిస్తాయని మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆశిస్తోంది. రైలు , పారిశ్రామిక అభివృద్ధితో సహా మౌలిక సదుపాయాల రంగాలలో పురోగతిని కూడా రాష్ట్రం హైలైట్ చేసిందిపరిశ్రమ-ప్రభుత్వ అనుసంధానతను బలోపేతం చేయడఈ సమావేశంలో గౌరవనీయులైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సీనియర్ పరిశ్రమ ప్రతినిధులతో పూర్తి స్థాయి చర్చలు జరిపారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అను కూలమైన వాతావరణాన్ని పెంపొందించడానికి రాష్ట్రం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు. రాష్ట్రం యొక్క చురుకైన విధా నాన్ని యాక్సిస్ ఎనర్జీ అభినందిస్తుంది. స్వచ్ఛ ఇంధన వృద్ధిని నడిపించడంలో భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తోంది.

# ఆడపడుచుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం




**ఆదిలాబాద్ :** సామాజిక ఆర్థిక సాధికారికతలో మహిళలకు ఎవరూ సాటిరారని, ఆడబిడ్డల సంక్షేమమే ప్రాధాన్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర సంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.సోమవారం ఆదిలాబాద్ జిల్లా కంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి ప్రారంభించారు. అనంతరం అనుకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్న భాస గంగమ్మకు చీర, సారె వస్త్రాలు పంపిణీ చేసి ఇందిరమ్మ గృహాన్నిమంత్రి ఎంపీ గోడం నగేష్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజార్షి షా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూమహిళలు గృహాలకు పరిమితం కాకుండా ఆర్థిక సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని మంత్రి వెల్లడించారు. మహిళల ఆదాయ వనరులను పెంపొందించేందుకు, యజమానులను చేసేందుకు ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ పంపుల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందువల్ల కుటుంబ ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.4.5 లక్షల ఇందిరమ్మ గృహాలకు కార్యాచరణ.రాష్ట్రంలో గూడు లేని పేదల కోసం 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22 వేల కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని పొదుపు సంస్కృతి అలవర్చుకోవాలని సూచించారు.బొట్టుపెట్టి.. ఇందిరమ్మ చీరల పంపిణీ.అనంతరం కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు మహిళా సంఘాలకు రూ. 21.83 స్వయం శక్తి రుణాల చెక్కు లను మంత్రి అందజేశారు. ఆదిలాబాద్ లోని కైలాసనగర్లో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన దివ్యాంగుల సంక్షేమ భవనాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు. రూ.3.55 కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన..! అదిలాబాద్ జిల్లా () సోనాల మండల కేంద్రం లో ఎస్టి ఎస్డిఎఫ్ పథకం కింద గుడిహత్నూర్ నుండి లింగాపూర్, మల్కాపూర్ వరకు బీటీ రోడ్డు పనులకు మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు. రూ.93లక్షల అంచనాతో సోనాలలో సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా అక్కడి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంత్రి జూపల్లిని మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి పనుల గురించి వివరించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీబీ చైర్మన్ బోజరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, శ్యామలాదేవి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్, డీఆర్‌డీఓ రవీందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన



**హైదరాబాద్, నవంబర్ 24:** ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాల ముఖ్యమంత్రులకు బహిరంగ లేఖ రాసింది. మూడు రాష్ట్రాల్లో కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధ విరమణపై తేదీని ప్రకటిస్తామని లేఖలో పేర్కొంది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది.మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాల్లో ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీ ఈ మేరకు లేఖను విడుదల చేసింది. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు, డీజీపీలు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా ఆయుధాలు వదిలేస్తామని మావోయిస్టు పార్టీ చెప్పింది. ఈ లేఖపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నాయో చూడాల్సి ఉంది.

# స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టులో విచారణ వాయిదా





**హైదరాబాద్, నవంబర్ 24:** స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. చీఫ్ జస్టిస్ సెలవులో ఉండటంతో (సోమవారం) జరగాల్సిన విచారణ వాయిదా పడింది. దీనిపై మంగళవారం నాడు విచారణకు వచ్చే అవకాశం ఉంది.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. ఈ నెల 25 లేదా 26వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని గురువారం తన కార్యాలయం నుంచి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత షెడ్యూల్‌లో ప్రకటించినట్టుగా మూడు దఫాల్లో ఎన్నికలను నిర్వహిస్తారని తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ డిసెంబర్ 20-25 తేదీల్లో ఎన్నికల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.

# ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రమాదం ముగ్గురు మృతి




**హైదరాబాద్, నవంబర్ 24:** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సోమవారం ప్రమాదం జరిగింది. భవనం మరమ్మతులు చేస్తుండగా.. సెంట్రింగ్ కుప్పకూలింది. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారు. ఈఎస్ఐలోని అత్యవసర విభాగంలో ఆధునీకరణ (రెనోవేషన్) పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో చేపట్టారు.శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో.. వాటిని తొలగించి కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు సైతం ఘటన స్థలానికి చేరుకుని.. వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈఎస్ఐ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

# తెల్లాపూర్‌లో భారీగా గంజాయి పట్టివేత



**హైదరాబాద్:** హైదరాబాద్ శివార్లలోని తెల్లాపూర్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను తెల్లాపూర్‌లోని ఓ లేబర్ క్యాంప్‌లో మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి 42 కిలోల గంజాయిని సీజ్ చేశారు.దీని విలువ రూ.21 లక్షలు ఉంటుందని అధికారులు చెప్పారు. బెంగాల్‌కు చెందిన మిథున్ భర్మా, సుడెన్ రాయ్, షేక్‌ను అరెస్టు చేశామని, ప్రధాన నిందుతుడు బిస్వా తప్పించుకున్నాడని తెలిపారు. వారి వద్ద గంజాయితోపాటు 5 ఫోన్లు సీజ్ చేశామన్నారు. నిందితుపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# పంచసూత్రాల ద్వారా రైతులకు మేలు చేస్తాం



**అమరావతి, నవంబర్ 24:** రైతులకు పంచసూత్రాల ద్వారా మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. (సోమవారం) కృష్ణా జిల్లా ఘంటసాలలో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంపై మంత్రి మాట్లాడుతూ.. నేటి నుంచి 29 వరకు ప్రతి రైతు ఇంటికి వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు ఇంకా మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను అమలు చేయబోతున్నామన్నారు.వచ్చే నెల 3న ప్రతి పరిధిలో వర్క్‌షాపులు నిర్వహణ ఉంటుందని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు, రైతులకు అవగాహన కార్యక్రమాలే ప్రధాన అంశాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, ఆక్వా, పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులందరికీ అవగాహన కల్పించేలా వర్క్ షాపులో దిశా నిర్దేశం చేస్తామన్నారు.17 నెలలుగా రైతుల్ని, వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమాలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి నడిపించాలని, ప్రతి రైతు సేవా కేంద్రంలో కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

# జగన్ అండ్ కో కుట్రలు, కుతంత్రాలతో రగిలిపోతున్నారు




**అమరావతి, నవంబరు 24 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కోకు కుట్రలు, కుతంత్రాలతో పాటు కుళ్లు, ఈర్ష్య, అసూయలు బాగా పెరిగిపోతు న్నాయని ఎద్దేవా చేశారు. (సోమవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు సంతోషంగా ఉంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. పంచ సూత్రాల పేరుతో తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు మంత్రి అనగాని సత్యప్రసాద్.తమ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి అసూయతో జగన్ అండ్ కో రగిలిపోతు న్నారని దెప్పిపొడిచారు. జగన్ రెడ్డి పాలనలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యమయ్యాయని విమర్శిం చారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి సగటున 700 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సీఎం చంద్రబాబు తన విజనరీతో రైతులకు పంచ సూత్రాలను అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. పంచ సూత్రాల ద్వారా రైతులు తమ ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడతారని వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రైతులు రారాజులుగా మారతారని చెప్పుకొచ్చారు. దీన్ని తట్టుకోలేకే జగన్ పంచ సూత్రాలపై పడి పడి ఏడుస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# డిప్యూటీ సీఎం పవన్ పర్యటనలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఫైట్



**రాజమండ్రి, నవంబర్ 24:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో తెలుగు తమ్ముళ్ల మధ్య గొడవ జరిగింది. ఎయిర్‌పోర్టులోకి రాజానగర్ టీడీపీ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణను అనుమతించకపోవడంపై పోలీసు లతో వాగ్వాదానికి దిగారు. సీఎం ప్రోగ్రాం కమిటీ సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌ను ఎలా అనుమతించారంటూ పోలీసులతో బొడ్డు వర్గం గొడవకు దిగింది. కాగా. జిల్లా పర్యటనలో భాగంగా ఉపముఖ్యమంత్రి పవన్ (సోమవారం) రాజమండ్రి ఎయిర్‌పోర్టు కు వచ్చారు. ద్వారకాతిరుమల మండలం ఐ ఎస్. జగన్నాథపురం లక్ష్మి నరసింహా స్వామిని దర్శించుకునేందుకు పవన్ రాజమండ్రికి చేరుకున్నారు.విమానాశ్రయంలో పవన్‌ను కలిసేందుకు ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్ వర్గీయులు, రాజానగరం టీడీపీ నియోజవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి వర్గీయులు వచ్చారు. అయితే పవన్‌ను కలిసేందుకు పెందుర్తి వర్గీయులను ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లోకి పోలీసులు అనుమతించారు. కానీ బొడ్డు వెంకటరమణ వర్గీయులను మాత్రం లోనికి అనుమతించని పరిస్థితి. దీంతో వారు పోలీసు లతో వాగ్వివాదానికి దిగారు. పెందుర్తి వర్గీయులను ఎయిర్‌పోర్టులోకి ఎలా అనుమతించారు?.. వాళ్లకు ప్రోటోకాల్ ఉందా? అని ప్రశ్నించారు.తమను ఎందుకు అనుమతించడం లేదని బొడ్డు వర్గీయులు ఫైర్ అయ్యారు. ఈ పరిస్థితుల్లో పెందుర్తి వర్గానికి చెందిన టీడీపీ నేతలు ఎయిర్‌పోర్టులో నుంచి బయటకు వచ్చారు. దీంతో ఇరు వర్గాలు పరస్పరం వాగ్వివాదానికి దిగాయి. బూతులు తిట్టుకోవడమే కాకుండా కొట్టుకునే స్థాయికి రెండు వర్గాల నేతలు వెళ్లారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల నేతలను విడదీయడంతో పరిస్థితి సర్దుమణిగింది.

# చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అస్వస్థత ఏమైందంటే




**విజయవాడ, నవంబరు 24 :** వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిఅస్వస్థతకు గురయ్యారు. హుటాహుటిన ఆయనను వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతకొంతకాలంగా వెరికోస్ వెయిన్స్‌తో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే చెవిరెడ్డి అస్వ స్థతకు గురైనట్లు సమాచారం. ఆస్పత్రిలో ఆయనకు వైద్యం అందిస్తు న్నారు. అనంతరం డాక్టర్లు మీడియాకు చెవిరెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. కాగా, వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ఏపీ లిక్కర్ స్కాం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ కేసును సిట్ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అప్పగించారు. ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న వారిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. సిట్ అధికారులు అరెస్ట్ చేసిన వారిలో చెవిరెడ్డి కూడా ఉన్నారు. ఆయనను పలు దఫాలుగా సిట్ అధికారులు విచారణ చేశారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. మద్యం స్కాం ద్వారా చెవిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు భారీస్థాయిలో ఆస్తులను కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆస్తులను జప్తుచేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే అధికారులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.

# జగన్ హయాంలో రైతులు నష్టపోయారు




**ఢిల్లీ, నవంబరు 24 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి తెలుగుదేశం పార్టీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ) స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో రైతుల కోసం చేసిన మంచి పనులు ఏమున్నాయని ప్రశ్నించారు. జగన్ పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ధ్వజమెత్తారు. అన్నదాతలు వైసీపీ హయాంలో చాలా నష్టపోయారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో రెండు విడతలుగా 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేశామని స్పష్టం చేశారు. (సోమవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. రైతులకు ఇప్పటికే రూ.14,000 ఇచ్చామని చెప్పుకొచ్చారు. త్వరలో మూడో విడతగా రూ.6,000 విడుదల చేస్తామని పేర్కొన్నారు. మొత్తం సంవత్సరానికి రూ.20,000 అన్నదాతలకు సహాయం చేశామని తెలిపారు. ప్రకృతి విపత్తుల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఫీల్డ్‌లోకి వచ్చి చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. రైతాంగం ఎన్డీఏ నాయకత్వానికి పూర్తిగా అనుకూలంగా ఉందని తెలిపారు. జగన్ నాంపల్లి కోర్టుకు హాజరు కావడాన్ని కూడా పూర్తిగా రాజకీయ ర్యాలీగా మార్చారని విమర్శలు చేశారు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.ఏపీకి పెట్టుబడులు భారీగా వస్తున్నా యని. ఇదంతా చంద్రబాబు నాయకత్వం వల్లే సాధ్యమవు తోందని వివరించారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమ్మిట్‌లో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి ప్రజల్లో మమేకమై వారి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా చేస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

# స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఇదే మా లక్ష్యం



**అమరావతి:** ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమగ్ర సమాచారంతో స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఉంటుందన్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్ డేటా లేక్‌తో కుటుంబం, వ్యక్తుల వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, పౌరసేవల పర్యవేక్షణకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ ఒక్కటే ఉంటుందని తెలిపారు. కుటుంబ సాధికారిత కోసం ఈ వ్యవస్థను వినియోగించాలని చంద్రబాబు సూచించారు. కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.జూన్ నాటికి స్మార్ట్ ఫ్యామిలీ కార్డ్ రాష్ట్రంలోని 1.4 కోట్ల కుటుంబాలకు జూన్ నాటికి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఫ్యామిలీ కార్డును జారీ చేయాలని అధికారులకు సూచించారు. 25 రకాల సేవలతో పాటు పీ4 లాంటి అంశాలను అందులో చేర్చాలని తెలిపారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలని చెప్పారు. స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేసేలా చూడాలన్నారు.ఇదే మా లక్ష్యం వాక్సినేషన్, ఆధార్, ఎఫ్‌బీఎంఎస్ ఐడీ, కుల ధృవీకరణ, పౌష్టికాహారం, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్లు సహా వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన వివరాలన్నీ ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ జరిగేలా చూడాలన్నారు. కేవలం పెన్షన్లు, రేషన్ వంటి పథకాల వివరాలకు మాత్రమే ఈ ఎఫ్‌బీఎంఎస్ వ్యవస్థను పరిమితం చేయొద్దని, పౌరులకు చెందిన అన్ని వివరాలనూ నమోదు చేసేలా ఈ కార్డు ఉండాలని ఆదేశించారు. సుపరిపాలనలో భాగంగా ఈ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించటంతో పాటు సులభంగా పౌరసేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని పథకాలకు లబ్దిదారుల ఎంపికలో ఎదురవుతున్న సవాళ్లు కూడా ఈ వ్యవస్థ ద్వారా పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు.ఎప్పటికప్పుడు అప్డేట్ అవ్వాలిపట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ అయ్యేలా చూడాలన్నారు. ఫ్యామిలీ కార్డును స్మార్ట్ కార్డుగా జారీ చేయాలని, ఒకే కార్డు ద్వారా పౌరులు అన్ని ప్రభుత్వ సేవల్ని, పథకాలను అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఆధార్ సహా అన్ని వివరాలు ఈ ఒక్క కార్డు ద్వారానే తెలిసేలా రూపొంది ంచాలని చెప్పారు. 2026 జనవరి నాటికి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించి జూన్‌లోగా కార్డులు పంపిణీ చేసేందుకు చర్యలు సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

# చ్చిన మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**ఏలూరు జిల్లా:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబె ట్టుకున్నారు. గత పర్యటనలో ఏలూరు జిల్లా, ఐ.ఎస్. జగన్నా థపురం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి వచ్చిన సంద ర్భంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ ప్రదక్షిణ మం డప నిర్మాణంతోపాటు గ్రామం నుంచి కొండ పైకి వెళ్లేందుకు రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని మంత్రివర్గం దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. ఇందుకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి రూ. 8.7 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆలయానికి అనుబంధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు 30 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి ఇప్పించారు.సోమవారం ఐ.ఎస్.జ గన్నాథపురం పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ .. జిల్లా ఇంఛార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలసి శ్రీ లక్ష్మీ నరసిం హస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రూ. 3.5 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న ప్రదక్షణ మండపానికి, రూ. 3.7 కోట్ల పంచాయతీరాజ్ రోడ్ అసెట్స్ నిధులతో ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామం నుంచి ఆల యానికి వెళ్లేందుకు నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. దీంతో పాటు ఇప్పటికే ఆర్ అండ్ బి శాఖ సహాయంతో పొంగుటూరు, లక్కవరం మధ్య గోతుల మయంగా ఉన్న రహదారికి రూ.1.5 కోట్లతో మర మ్మతులు చేయించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈ రహదారిని పరిశీలించారు.30 ఎకరాల భూమి పత్రాలు ఆలయ అధికారులకు అందజేత..శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పవన్ కళ్యాణ్ గత పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి భూమి ఇప్పిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 30 ఎకరాల భూ కేటాయింపుకి సంబంధించిన పత్రా లు సోమవారం పవన్ కళ్యాణ్ గారు ఆలయ అధికారులకు అందజే శారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కళ్యాణ్ కు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హర్షధ్వానా లతో ధన్యవాదాలు తెలియజేశారు.పూల వర్షం.. కూలీలతో పవన్ కల్యాణ్ ముచ్చ ట్లు.అంతకు ముందు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఐ.ఎస్. జగన్నాథపురం వచ్చిన పవన్ కళ్యాణ్ కు ప్రజలు దారి పొడవునా పూల వర్షంతో స్వాగతం పలికారు. రాజవరం, యర్రంపేట, గవరవరం, ఐ.ఎస్. జగన్నాథపురం గ్రామాల్లో ఆడపడుచులు పవన్ కళ్యాణ్ కు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను తెలియచేసేందుకు ముందుకు రాగా వారి వద్దకు వెళ్ళి వినతి పత్రాలు స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. తిరుగు ప్రయాణంలో పొలాల్లో పని చేసుకుంటున్న కూలీలను ఆప్యాయంగా పలకరించి, వారితో ఫొటోలు దిగారు.

# పిల్లలకు నైతిక విలువలు చాలా అవసరం



**విజయవాడ, నవంబర్ 24:** నైతిక విలువలు, సమాజంలో మార్పుకు సంబంధించి సలహాదారుగా చాగంటి కోటేశ్వర రావును తీసుకున్నామని మంత్రి నారా లోకేష్ అన్నారు. (సోమవారం) తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విలు వలు, విద్యా సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. చాగంటికి క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చి సలహాదారుగా నియమించామని తెలిపారు. చాగంటి కోటేశ్వరరావు ప్రభుత్వ వాహనం వాడలేదని.. సొంతంగానే తన ఫోన్ బిల్లు చెల్లిస్తున్నారని చెప్పుకొచ్చారు. బడిలో పిల్లలకు ఆట పాటలు చదువుతో పాటు నైతిక విలువలు అందించాలని సూచించారు. ఆటోమిక్ ఎనర్జీని విద్యుత్ తయారీకి వాడితే దేశం అంతా ఘనంగా వెలుగుతుందని.. అదే ఆటోమిక్ ఎనర్జీని బాంబు తయారీకి వాడితే హిరోషిమా నాగసాకిలా తయారవుతుందని అన్నారు.ప్రభుత్వం పుస్తకాలు రూపొందిస్తోందన్నారు. ఇంట్లో నుంచి మార్పు మొదలవ్వాలని.. తల్లిదండ్రులు ఈ బాధ్యత తీసుకోవాలని కోరారు. మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి సరికాదని మంత్రి లోకేష్ అన్నారు. జీవితంలో అవమానాలు సహజమని.. లక్ష్యంతో పనిచేస్తే విజయం సాధించగలమని చెప్పుకొచ్చారు. మహిళలను గౌరవించినప్పుడు సమాజం బాగుపడుతుందని తెలిపారు. వెబ్ సిరీస్‌లోనూ మహిళలను అగౌరవంగా చూపకూ డదన్నారు. మగవారు, మహిళలు ఇద్దరు సమానమే అని స్పష్టం చేశారు. పిల్లలను చూస్తే దేవుడిని చూసినట్టు ఉంటుందని.. వాళ్ళని బాగా చూసుకోవాలని పేర్కొన్నారు. డ్రగ్స్‌పై తమ ప్రభుత్వం యుద్ధం ప్రకటించిందని.. దీన్ని అంతా సీరియస్‌గా తీసుకోవాలన్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి సరికాదన్నారు. జీవితంలో అవమానాలు సహజమని.. లక్ష్యంతో పనిచేస్తే విజయం సాధించగలమని చెప్పుకొచ్చారు. టీచర్ల సమస్యలు చాలా వరకు పరిష్కరించామని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు కరికులంలో మార్పులు తెస్తున్నామన్నారు. పుస్తకాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలు.. జీవితంలో అవమానాలు సహజమని.. లక్ష్యంతో పనిచేస్తే విజయం సాధించగలమని చెప్పుకొచ్చారు. మహిళలను గౌరవించినప్పుడు సమాజం బాగుపడుతుందని తెలిపారు. వెబ్ సిరీస్‌లోనూ మహిళలను అగౌరవంగా చూపకూ డదన్నారు. మగవారు, మహిళలు ఇద్దరు సమానమే అని స్పష్టం చేశారు. జీవితంలో అవమానాలు సహజమని.. లక్ష్యంతో పనిచేస్తే విజయం సాధించగలమని చెప్పుకొచ్చారు. మహిళలను గౌరవించినప్పుడు సమాజం బాగుపడుతుందని తెలిపారు. వెబ్ సిరీస్‌లోనూ మహిళలను అగౌరవంగా చూపకూ డదన్నారు. మగవారు, మహిళలు ఇద్దరు సమానమే అని స్పష్టం చేశారు. పార్టీ రంగులు లేవన్నారు. ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తోందని మంత్రి తెలిపారు.తల్లిదండ్రులు పెట్టుకున్న బాధ్యతను పిల్లలు నిలబెట్టుకోవాలని సూచనలు చేశారు. పుట్టపర్తిలో సత్యసాయి బాబా జయంతి కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. అక్కడకు వచ్చిన పిల్లలు ఓ చిన్న కాగితం చెత్తను కూడా వేయకుండా జాగ్రత్తగా అన్నింటిని చెత్తబుట్టలో వేయడం చాలా గొప్పవిషయమని కొనియాడారు. ఈ తరహా క్రమశిక్షణ అందరికీ రావాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో నైతిక విలువలపై ప్రసంగాలు చేయాలని చాగంటి కోటేశ్వర రావును మంత్రి నారా లోకేష్ కోరారు. కాగా.. ఈ సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ప్రభుత్వ సలహాదారు, ప్రవచన ప్రముఖులు చాగంటి కోటేశ్వర రావు ప్రసంగించారు. మంత్రి లోకేష్‌తో పాటు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, విద్యాశాఖ కార్యదర్శి సదస్సులో పాల్గొన్నారు.

# కాలుష్యంపై దిల్లీలో నిరసనలు ప్రదర్శనలో హిడ్మాపోస్టర్లు




**దిల్లీ:** దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా జరిపిన నిరసనలు వివాదాస్పదమయ్యాయి. ఇండియా గేటు వద్ద ఆదివారం జరిగిన ఈ నిరసనల్లో ఆందోళనకారులు ఇటీవలే ఆంధ్రప్రదేశ్?లో భద్రతా బలగాలు చేతిలో హతమైన మావోయిస్టు అగ్రనేత మాద్వి హిడ్మా పోస్టర్లను ప్రదర్శించారు. దీంతో ఆ నిరసనలు కాస్త వివాదానికి దారితీశాయి. ఈ ఘటనపై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.పోలీసులపై పెప్పర్ స్ప్రే ప్రయోగం- 15 మంది అరెస్ట్దిల్లీలో రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా ప్రజలు నానావస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదివారం పలువురు ఇండియా గేటు వద్ద నిరసనలకు దిగారు. ఈ నిరసనల్లో ఇటీవల భద్రతా బలగాల ఎన్?కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా హిడ్మా పోస్టర్లను ప్రదర్శించడం విదాస్పదమైంది. ఈ నేపథ్యంలో అక్కడికి పోలీసులు చేరుకున్నారు. నిరసనకారులను అక్కడ నుంచి చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో నిరసనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులపై నిరసనకారులు పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. దీంతో తమపై దాడికి యత్నించిన నిరసకారులపై పోలీసులు కేసు నమోదు చేసి, 15 మందిని అరెస్టు చేశారు.'పోలీసులపై పెప్పర్ స్ప్రే ప్రయోగం ఇదే మొదటిసారి'పోలీసులపై పెప్పర్ స్ప్రే ప్రయోగించినందుకు, విధులకు ఆటంకం కలిగించినందుకు, రోడ్డును నిర్బంధించేందుకు ప్రయత్నించినందుకుగానూ 15 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేశామని అని న్యూదిల్లీ డీసీపీ దేవేశ్ కుమార్ తెలిపారు. వారిపై సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామి వెల్లడించారు. ఇలాంటి ఆందోళనల్లో నిరసనకారులు పెప్పర్ స్ప్రే ప్రయోగించడం ఇదే తొలిశారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు.' 'కొంతమంది నిరసనకారులు ఇండియా గేట్ వద్ద గుమిగూడారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటడానికి ప్రయత్నించారు. బారికేడ్లను బద్దలు కొట్టి రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. దీంతో చాలా అంబులెన్స్?లు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో నిరసనకారులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించాం. ట్రాఫిక్?కు అంతరాయం కలగించొద్దని విజ్ఞప్తి చేశాం. అక్కడ నుంచి వారిని చెదరగొట్టే సమయంలో పోలీసులతో నిరసనకారులు గొడవపడ్డారు. పోలీసులపై పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. ఈఘటనలో చాలా మంది పోలీసులు గాయపడ్డారు. మొదటిసారిగా పోలీసు సిబ్బందిపై పెప్పర్ స్ప్రే వాడకాన్ని మేము ఎదుర్కొన్నాం. మా అధికారులలో కొంతమంది కళ్లపై పెప్పర్ స్ప్రే పడింది. ప్రస్తుతం వారు ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు." అని దిల్లీ డీసీపీ దేవేశ్ కుమార్ స్పష్టం చేశారు.పోలీసుల చర్యను సమర్థించిన మంత్రికాగా, నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేయడంపై దిల్లీ మంత్రి కపిల్ మిశ్రా స్పందించారు. పోలీసుల చర్యను ప్రశంసించారు. ఈ చర్య నక్సలిజం భావజాలానికి తగిన ప్రతిస్పందనగా అభివర్ణించారు. "ఆదివారం దిల్లీలో జరిగిన నిరసనలను చూడండి. కాలుష్యం ముసుగులో చేతిలో పోస్టర్లు, వారి పెదవులపై రెడ్ సెల్యూట్ నినాదాలు. సామాజిక కార్యకర్తలుగా నటిస్తున్న జిహాదీలు, మావోయిస్టుల కొత్త ముఖం వారు" అని కపిల్ మిశ్రా ఎక్స్?లో పోస్ట్ చేశారు.దిల్లీలో తీవ్ర కాలుష్యం- ఆందోళనలో ప్రజలుకాగా, దిల్లీలో వాయు కాలుష్యం అంతకంతకు పెరిగిపోతోంది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయిల్లో క్షీణిస్తోంది. ఈ క్రమంలో దేశ రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గుండె, ఆస్తమా, ఊపిరితిత్తుల సంబంధింత రోగులు, చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్ 9న కూడా దిల్లీలో వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం సరైన విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఇండియా గేట్ వద్ద నిరసనలు తెలిపారు. మళ్లీ నవంబరు 23న (ఆదివారం) జరిపిన నిరసన కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. అందుకు పోలీసులపై నిరసకారులు పెప్పర్ స్ప్రే ప్రయోగించడం ఒక కారణం కాగా, మరొకటి ఇటీవల హతమైన మావోయిస్ట్ అగ్రనేత మాధ్వి హిడ్మా పోస్టర్ ను ప్రయోగించడం. సోమవారం ఉదయం 7 గంటలకు దిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ ) 396 వద్ద ఉంది. దీంతో చాలా పేలవమైన కేటగిరీలోకి గాలి నాణ్యత సూచీ వచ్చిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. అలాగే ఘాజీపుర్ ప్రాంతంలో ఏక్యూఐ 441, ఆనంద్ విహార్ ఏక్యూఐ 440 నమోదైంది. సోమవారం ఉదయం ఇండియా గేట్ ప్రాంతంలో విషపూరిత పొగమంచు పొర కప్పేసింది.

# నకిలీ కరెన్సీ రాకెట్ గుట్టురట్టు



**భోపాల్:** నకిలీ కరెన్సీ రాకెట్ గుట్టు రట్టయ్యింది. ప్రధాన నిందితుడు ఒక డాక్టర్ అని తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. సుమారు రూ.40 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేసినట్లు గుర్తించారు. డాక్టర్తో సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్లోని ఖాండ్వా జిల్లాలో ఈ కుంభకోణం బయటపడింది. పెథియా గ్రామానికి చెందిన మౌలానా జుబేర్ అన్సారీ నకిలీ కరెన్సీ మార్పిడి చేస్తూ మహారాష్ట్రలో అరెస్టయ్యాడు. అతడి ఇంట్లో భారీగా నకిలీ కరెన్సీ ఉన్నట్లు నవంబర్ 2న జవార్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో అన్సారీ ఇంటిపై రైడ్ చేశారు. రూ.19.78 లక్షల నకిలీ రూ.500 నోట్లు, నోట్ కటింగ్ మెషిన్, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కాగా, ఈ నకిలీ నోట్ల రాకెట్పై లోతుగా దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అసలు సూత్రధారి డాక్టర్ ప్రతీక్ నవలఖే అని తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. నవంబర్ 23న రహస్య సమాచారం మేరకు భోపాల్లోని గోకుల్ధామ్ సొసైటీలో ఒక అద్దె ఇంటిపై రైడ్ చేశారు. నకిలీ నోట్ల ముద్రణ కోసం కేటాయించిన చిన్న గదిలో ప్రింటర్లు, కట్టర్లు, డ్రైయింగ్ మెషీన్లు, కంప్యూటర్లు వంటివి ఉండటం చూసి షాక్ అయ్యారు. డాక్టర్ ప్రతీక్తోపాటు పాటు గోపాల్ అలియాస్ రాహుల్, హర్దా, దినేష్ గోర్ను పోలీసులు అరెస్ట్ చేశారు. లక్షల విలువైన ఆ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు బుర్హాన్పూర్కు చెందిన డాక్టర్ ప్రతీక్ గతంలో ఆ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంవో)గా పనిచేశాడు. కీలక ప్రభుత్వ వైద్యాధికారిగా ఉన్నప్పుడు కోట్లలో మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అరెస్టై జైలుకెళ్లాడు. జైలులో ఉన్నప్పుడు మిగతా నిందితులు ఆ డాక్టర్కు పరిచయమయ్యారు.

# తేజస్ క్రాష్ తర్వాత ఎయిర్ షో నుంచి తప్పుకున్న అమెరికా పైలట్



**న్యూఢిల్లీ/దుబాయ్:** భారత వైమానిక దళానికి చెందిన తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షోలో కూలిపోయింది. ఐఏఎఫ్ పైలట్ మరణించారు. అయినప్పటికీ నిర్వాహకులు ఎయిర్ షో కొనసాగించడంపై అమెరికా వైమానిక దళానికి చెందిన పైలట్ విచారం వ్యక్తం చేశారు. అయితే ఆ పైలట్ గౌరవార్థం ఎయిర్ షో నుంచి తన బృందం తప్పుకున్నదని ఆయన వెల్లడించారు. శుక్రవారం దుబాయ్ ఎయిర్ షోలో తేజస్ కూలిపోయింది. ఐఏఎఫ్ పైలట్ వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ ఈ ప్రమాదంలో మరణించారు.కాగా, యునైటెడ్ స్టేట్స్ వైమానిక దళం (యూఎస్ఏఎఫ్)కు చెందిన పైలట్, ఎఫ్-16 వైపర్ డెమోన్‌స్ట్రేషన్ టీమ్ కమాండర్ మేజర్ టేలర్ 'ఫెమా' హైస్టర్ ఈ సంఘటనపై శనివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగంతో పోస్ట్ చేశారు. 'దుబాయ్ ఎయిర్ షో చివరి రోజున ఫైటర్ జెట్ విన్యాస ప్రదర్శనలో భారత వైమానిక దళ వింగ్ కమాండర్ నమాన్ష్ సయాల్ మరణించారు. అయినప్పటికీ ఎయిర్ షో కొనసాగించాలని నిర్వాహకులు షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. అయితే మరణించిన ఇండియన్ పైలట్, ఆయన సహచరులు, కుటుంబ సభ్యుల పట్ల గౌరవంతో మా తుది ప్రదర్శనను రద్దు చేయాలని మా బృందం నిర్ణయం తీసుకున్నది' అని అందులో పేర్కొన్నారు.

# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం



**న్యూ ఢిల్లీ :**సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాష్ట్రపతి భవన్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయ నతో ప్రమాణం చేయించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపడుతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్రమ ంత్రులు, అలాగే విదేశీ న్యాయ ప్రతినిధులు కూడా హాజర య్యారు.ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు దాదాపు 15 నెలలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి రాధా కృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ఖడ్, ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్నాథ్ సింగ్, జేపీ నడ్డా, రామ్మోహన్ నాయుడు, పీయూశ్ గోయల్ సహా పలువురు కేంద్రమంత్రులు, ఎన్?డీఏలో కీలక నేతలు హాజరయ్యారు. నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియా, బ్రెజిల్ నుంచి దాదాపు 15 మంది విదేశీ ప్రతినిధుల బృందాలు, వారి కుటుంబ సభ్యులు సైతం హాజరయ్యారు. వారిలో ప్రధాన న్యాయమూర్తులు కూడా ఉన్నారు.జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణా హిస్సార్ జిల్లాలోని జన్మించారు. 1981లో అక్కడి ప్రభుత్వ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే ఏడాది హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించిన ఆయన 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అలాగే 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. కీలక తీర్పుల్లో భాగస్వామిగా జస్టిస్ సూర్యకాంత్దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించిన జస్టిస్ సూర్యకాంత్ కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బిల్లుల విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ ఆలస్యంపై ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పులో కూడా జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో ఉన్నారు. బ్రిటీష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేస్తూ ఇచ్చిన తీర్పులో భాగస్వామిగా ఉన్న ఆయన ఈ చట్టం కింద కొత్తగా ఎఫ్ఐఆర్లు నమోదు చేయవద్దని తీర్పులో ఆదేశించారు. వాక్‌స్వాతంత్ర్యం, అవినీతి, బిహార్ ఓటర్ల జాబితా, పర్యావరణం, లింగసమానత్వం వంటి అంశాల్లో ఆయన కీలక తీర్పులను వెలువరించారు. బిహార్?లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఈసీ తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను వెల్లడించాలని ఆదేశించిందిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. సుప్రీంకోర్టుతో పాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఆయన ఆదేశించారు. 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' () పథకాన్ని ఆయన సమర్థిస్తూ, అది రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందని తీర్పును ఇచ్చారు. ప్రస్తుతం శాశ్వత సర్వీసుల్లో మహిళా అధికారులను నియమించే పిటిషన్‌పైనా వాదనలను ఆయన వింటున్నారు.అలాగే 1976 అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనారటీ హోదాను పునఃసమీక్షించేందుకు మార్గాన్ని సుగమం చేస్తూ తీర్పు ఇచ్చిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. పెగాసస్?పై విచారణ జరిపిన కేసులోనూ సూర్యకాంత్ భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లుల ఆమోదంపై దాఖలైన పిటిషన్ల విచారణ ధర్మాసనంలో ఆయన ఉన్నారు. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో జరిగిన భద్రతా లోపంపై దర్యాప్తు చేసేందుకు నియమించిన కమిటీలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు.

# రాజకీయ పార్టీలకు క్యాష్ డొనేషన్స్ పై పిటిషన్



**న్యూ ఢిల్లీ** సుప్రీంకోర్టు సోమవారం కేంద్రం, ఎలక్షన్ కమిషన్ సహా పలు రాజకీయ పార్టీలకు నోటీసులు జారీ చేసింది. రాజకీయ పార్టీలు రూ.2వేల కంటే తక్కువ మొత్తంలోని నగదు విరాళాలను లెక్కాపత్రం లేకుండా స్వీకరించడానికి అనుమతించే ఐటీ చట్టంలోని నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రతిస్పందించాలని కోరింది.రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల విషయంలో పారదర్శకత లేకపోతే, అది ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛను దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయ్యింది. విరాళాలు ఇచ్చే దాతలు, వారి ఉద్దేశాలు ఓటర్లకు తెలియాలని, ఇలా జరగకపోతే వ్యక్తులు ఓటు వేసే విషయంలో హేతుబద్ధమైన, తెలివైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆ పిటిషన్?లో పేర్కొన్నారు. అంతేకాదు రాజకీయ పార్టీని నమోదు చేయడానికి, ఎన్నికల చిహ్నాన్ని కేటాయించడానికి ఏ రాజకీయ పార్టీ- నగదు రూపంలో విరాళాలు స్వీకరించకుండా షరతులు విధించాలని, ఇందుకోసం ఎలక్షన్ కమిషన్‌కు కూడా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. దీనితో నాలుగు వారాల తర్వాత దీనిని విచారణ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అంతేకాదు దీనిపై ప్రతిస్పందించాలని కోరుతూ ఎన్నికల సంఘం, కేంద్రం, బీజేపీ, కాంగ్రెస్ లాంటి అనేక పార్టీలకు నోటీసులు జారీ చేసింది.ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్? 13ఏ లోని క్లాజ్(డీ) రాజ్యాంగ విరుద్ధమని, దానిని కొట్టివేయాలని పిటిషనర్? కోరారు. అంతేకాదు సుప్రీంకోర్టు 2024లో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును కూడా ప్రస్తావించారు.

# ఖాళీ అవుతున్న దండకారణ్యం



**ఛత్తీస్‌గఢ్ :** దేశంలోని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ విస్తృతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మావోయిస్టుల కేంద్ర స్థానం దండకారణ్యం ఖాళీ అవుతోంది. జనతన సర్కార్ పేరిట అబూజ్‌మడ్‌లో ఒకప్పుడు సమాంతర పాలన నడిపిన మావోయిస్టులు, ఇక ఇక్కడ సురక్షితంగా ఉండలేమంటూ దూరంగా వెళ్లిపోతున్నారు.అగ్ర నేతలే ఎన్‌కౌంటర్ల బారిన పడి మరణిస్తున్నారు. మరికొందరు లొంగుబాటులో పయనిస్తుండటం తో మిగిలిన క్యాడంలో ఉన్న వారు దిక్కుతోచని స్థితిలో పడిపో యారు. తమ ఆయువుపట్టును వదిలి అర్బన్ బాట పడుతు న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో పోలీసులకు చిక్కిన 50 మంది మావోయిస్టులు ఆ కోవలోనే పట్టణాలకు తరలి ఉంటారనే వాదన వినిపిస్తోంది.ఆ ప్రాంతంలో జనతన సర్కార్ : వాస్తవానికి భారతదేశ అంతర్గత శత్రువుగా ముద్రపడిన మావోయిస్టు పార్టీ మూడు దశాబ్దాలుగా అబూజ్‌మడ్ ప్రాంతాన్ని తమ కంచుకోటగా మలుచుకుంది. ప్రభుత్వవర్గాలు అడుగు పెట్టని ఆ ప్రాంతంలో జనతన సర్కార్‌ను నడిపింది. 1980 దశకంలోనే అప్పటి పీపుల్స్‌వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య (కేఎస్) పార్టీ కీలక నేతల్ని దండకారణ్యం బాట పట్టించారు.ఉమ్మడి రాష్ట్రంలో పట్టుకోల్పోయి : అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర కమిటీతో పాటు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కమిటీలుండేవి. ఆయా ప్రాంతాల్లోని గడ్చిరోలితో పాటు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యమే తమకు సురక్షిత స్థానమవుతుందని ఆనాడే కేఎస్ గ్రహించారు. అందుకే తొలుత గడ్చిరోలిలోకి ఆపై దండకారణ్యంలోకి దళాలను పంపించారు. కేఎస్ ఊహించినట్లుగానే శాంతి చర్చల అనంతరం 2007 ప్రాంతంలో నల్లమలను పోలీసులు జల్లెడ పట్టడంతో క్రమేపీ ఉమ్మడి రాష్ట్రంలో పట్టుకోల్పోయింది. అనంతరం ఆపరేషన్ ప్రహార్ సాగింది. అయితే ఆ రెండు ఆపరేషన్లను మావోయిస్టు పార్టీ ఎదుర్కొని నిలిచింది. అలాగే మావోయిస్టులను అంతమొందించే లక్ష్యంతో కాంగ్రెస్ నేత మహేంద్రకర్మ నేతృత్వంలో ఏర్పాటైన ప్రైవేట్ సైన్య 'సల్వాజుడం'నూ సమర్థంగా తిప్పికొట్టింది.అయితే గత సంవత్సరం ప్రారంభమైన ఆపరేషన్ కగార్ (అంతం) మాత్రం మావోయిస్టు పార్టీ రూపురేఖలనే మార్చేసింది. ఈ ఏడాదే మావోయిస్టు పార్టీని కోలుకోలేని దెబ్బతీసింది. 680 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయగా, 1,225 మంది లొంగిపోయారు. ఏకంగా 270 మంది ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, బాలకృష్ణ, గణేశ్, వికల్ప్, కోసా సహా ఏకంగా ప్రధాన కార్యదర్శి బస్వరాజ్‌ను సైతం పార్టీ కోల్పోయింది.లొంగిపోయే ప్రయత్నంలో : మరోవైపు సోను, రూపేశ్, చంద్రన్న లాంటి అగ్రనేతలు లొంగిపోయారు. తాజాగా దాడుల వ్యూహకర్త హిడ్మా ఎన్‌కౌంటం కావడం మిగిలిన పలువురు అగ్రనేతలు లొంగిపోయే ప్రయత్నాల్లో ఉండటంతో దండకారణ్యం ప్రాంతంలో మిగిలిన క్యాడర్ తలో దిక్కులో తలదాచుకుంది. కొందరు ఏవోబీ వైపు, మరికొందరు కర్రెగుట్టల మీదుగా, ఇంకొందరు ఎంఎంసీ జోన్‌లోని బాలాఘాట్ వైపు వెళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది.

# తమిళనాడు, ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదాలు- 12 మంది మృతి



**తమిళనాడు:** తెన్‌కాశి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా, 30 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యల్లో చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,మధురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు దురైసామిపురం ప్రాంతానికి రాగానే, ఎదురుగా తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. స్పాట్?లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మరణించగా, మరొకరు చికిత్స పొందుతూ మరణించారు. మరో 30 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ప్రమాదం ధాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం తెన్?కాశీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తెన్?కాశి జిల్లా కలెక్టర్ కమల్ కిశోర్?, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అరవింద్ నేతృత్వంలోని పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సును ప్రమాద స్థలం నుంచి తొలగించే పనులు చేపట్టారు.

# హైకమాండ్ డిసైడ్ చేస్తే నేనే సీఎంగా ఉంటా



**కర్ణాటక :** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివ కుమార్ మధ్య పోరాటం తీవ్రమవుతోంది. శివకుమార్‌కు మద్ద తు ఇస్తున్న ఆరుగురు ఎమ్మెల్యేలు ఇప్పటికే దిల్లీ వెళ్లి మకాం వేశా రు. మరికొందరు కూడా త్వరలో దిల్లీ వెళ్లే అవకాశం కనిపి స్తోంది. వీరు హైకమాండ్‌తో మాట్లాడి సీఎం మార్పుపై చర్చిం చడానికి సిద్ధమవు తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సిద్ధరా మయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పుపై హైక మాండ్ తుది నిర్ణయం తీసుకుంటుందని, దీనికి తాను, శివ కుమార్ ఇద్దరూ కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నారు. "మే ము కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. వారు నేను (సీఎం)గా కొనసాగాలని నిర్ణయిస్తే, నేను ముఖ్య మంత్రిగా కొనసాగుతాను. చివరికి హైకమాండ్ ఏది నిర్ణయిస్తే, నేను దానిని అంగీకరించాలి. శివకుమార్ కూడా దీనిని అంగీకరి ంచాల్సిందే."- సిద్ధరామయ్య, కర్ణాటక ముఖ్య మంత్రిప్రస్తుత పరిస్థితుల్లో శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారా అని విలేకరులు ప్రశ్నించినప్పుడు, "హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని నేను చెప్పాను. మీరు మళ్లీ అదే విషయాన్ని నన్ను అడుగుతున్నారు" అని సిద్ధరామయ్య అన్నారు.సీఎం పీఠం ఎవరి దక్కేను2023లో కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వచ్చారు. కాంగ్రెస్ చీఫ్‌గా శివకుమార్ పనిచేశారు. కాగా ఈ నవంబర్ 20తో మొదటి రెండున్నర ఏళ్ల పాలనా కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలోని సీఎం మార్పు అంశం తెరమీదకు వచ్చింది. అయితే సీఎం పీఠాన్ని వదలడానికి సిద్ధరామయ్య సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. అందుకే ఆయన నాయకత్వ మార్పును హైకమాండ్ నిర్ణయిస్తుందని చెబుతున్నారు. మరోవైపు శివకుమార్ మద్దతుదారులు దిల్లీ వెళ్లి దీనిపై హైకమాండ్‌తో మాట్లాడడానికి సిద్ధమవుతున్నారు.

# టీమిండియాను ముంచేసిన బ్యాటర్లు డ్రా కోసమైనా పోరాడుతారా

కోల్‌కతా టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన భారత జట్టు(ఏమాత్రం మెరుగవ్వలేదు. ఆ ఓటమి నుంచి తేరుకొని పుంజుకోవాల్సిన టీమిండియా మళ్లీ చతికిలబడింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లు గంటలకొద్దీ క్రీజులో నిలిచిన చోట మనోళ్లు తడబడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో మార్కో జాన్సెన్(6-48)ను ఎదుర్కోలేక డగౌట్‌కు క్యూ కట్టారు. ఫలితంగా టెస్టుపై ఆశలు సన్నగిల్లు తున్నాయి. అనూహ్యంగా 201కే కుప్పకూలిన భారత్ ఇక డ్రా కోసమే ఆడాల్సిన పరిస్థితి. రెండు రోజుల ఆట మిగిలి ఉన్నందున సఫారీ బౌలింగ్ దళాన్ని కాచుకొని రిషభ్ పంత్ సేన సిరీస్ సమం చేయాలంటే ఏదైనా అద్భుతం జరగాలి.సొంత గడ్డపై ఇటీవలే వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత జట్టు ఇప్పుడు విజయం కోసం అష్టకష్టాలు పడుతోంది. టెస్టు ఛాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా బ్యాటర్లను నిలువరించలేక బౌలర్లు.. క్రీజులో నిలవలేక మన బ్యాటర్లు అపసోపాలు పడుతున్నారు. సమిష్టి వైఫల్యంతో తొలి ఇన్నింగ్స్‌లో 201కే ఆలౌటైన టీమిండియా మ్యాచ్‌ను దాదాపు అప్పగించేసినట్టే. సఫారీలు పరుగుల పండుగ చేసుకున్న చోట యశస్వీ జైస్వాల్(58) మినహా ఏ ఒక్కరూ రాణించలేదు.రాహుల్‌ను కేశవ్ మహారాజ్ వెనక్కి పంపగా.. కాసేపటికే యశస్విని హార్మర్ బోల్తా కొట్టించాడు. అనంతరం.. జాన్సెన్ (6-48) విజృంభణకు.. అద్భుత ఫీల్డింగ్ తోడవ్వగా 142కే ఏడు వికెట్లు కోల్పోయింది భారత్. ఆ దశలో క్రీజులో పాతుకుపోయిన వాషింగ్టన్ సుందర్(48), కుల్దీప్ యాదవ్(19) ఆపద్బాంధవులయ్యారు. ప్రత్యర్థి బౌలింగ్ దళాన్ని దీటుగా ఎదుర్కొన్న ఈ ద్వయం ఎనిమిదో వికెట్‌కు 72 రన్స్ జోడించి పరువు కాపాడింది. వీరిద్దరి అసమాన పోరాటంతో భారత్ 201 రన్స్ చేయగలిగింది. దాంతో.. పర్యాటక జట్టుకు 288 పరుగుల ఆధిక్యం లభించింది.ముతుస్వామి శతకంతో.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డబ్ల్యూటీసీ ఛాంపియన్ దక్షిణాఫ్రికా గువాటి టెస్టులో పట్టుబిగించింది. ఓపెనర్లు ఎడెన్ మర్క్‌రమ్(38), రియాన్ రికెల్టన్(35)లు 82 పరుగులతో శుభారంభమివ్వగా.. మిడిలార్డర్ అదే జోరు చూపించింది. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ కెప్టెన్ తెంబా బవుమా(41), ట్రిస్టన్ స్టబ్స్(49)లు స్కోర్‌బోర్డును నడిపించారు. వీరిద్దరూ ఔటైనా.. సెరులిన్ ముతుస్వామి (109), మార్కో జాన్సెస్(93)ల అద్భుత బ్యాటింగ్ షోతో 389 రన్స్ చేసింది సఫారీ టీమ్. అనంతరం భారత్‌ను 201కే కుప్పకూల్చి మ్యాచ్‌ను తమ చేతుల్లోకి తెచ్చుకుంది.అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 26 పరుగులు చేసింది పర్యాటక జట్టు. మూడో రోజు ఆట ముగిసే సరికి ఓపెనర్లు రియాన్ రికెల్టన్(13 నాటౌట్), ఎడెన్ మర్క్‌రమ్(12 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం 314 పరుగుల ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా నాలుగో రోజు రెండో సెషన్‌లోపే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసే అవకాశముంది. టీమిండియా ముందు 400 ప్లస్ లక్ష్యాన్ని నిర్దేశించాలని బవుమా బ్యాచ్ భావిస్తోంది. ఏదైనా జరిగితే తప్ప ఈ మ్యాచ్ కూడా టీమిండియా ఓడిపోవడం ఖాయం.





# తెలంగాణలోని ఆ రూ. 2,200 కోట్లు ఎవరివి అందులో మీ డబ్బు కూడా ఉందా



రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకుల్లో నిలిచిపోయిన అన్‌క్లెయిమ్డ్ డబ్బు పరిమాణం ఆందోళన కలిగించే స్థాయిలో ఉందని తాజా గణాంకాలు సూచిస్తు న్నాయి. దాదాపు పది సంవత్సరాలుగా ఎటువంటి లావాదేవీలు జరగని ఖాతాలు లక్షల సంఖ్యలో ఉండగా. వాటిలో కోట్ల రూపాయలు 'యజ మాని ఎవరు?' అనేది తెలియక మూలుగుతున్నాయి. ఈ వివరాలను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీఆర్బీఐకి నివేదించింది. సుమారు 80 లక్షల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,200 కోట్లు అన్‌క్లెయిమ్డ్ డబ్బు ఉన్నట్లు సమా చారం. ఖాతాదారులు నామినీ వివరాలు ఇవ్వకపోవడం, అకస్మాత్తుగా మరణిం చడం, చిరునామాలు మార్చి అప్డేట్ చేయక పోవడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడి నట్లు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి టాప్‌లోఅన్నింటికంటే ఎక్కువగా అన్‌క్లెయిమ్డ్ సొమ్ము హైదరాబాద్ నగరంలోనే ఉంది. ఒక్క జిల్లాలోనే రూ. 850 కోట్లు నిలిచిపోయాయి. రెండో స్థానంలో రంగారెడ్డి జిల్లా రూ. 300 కోట్లతో ఉంది. వరంగల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లోనూ పెద్ద మొత్తంలో ఖాతాలు క్లెయిమ్ లేకుండా నిలిచిపోయాయి. బ్యాంకుల వారీగా పరిస్థితి.దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ ఎస్బీఐలో అత్యధిక అన్‌క్లెయిమ్డ్ డబ్బు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. లో 21.62 లక్షల ఖాతాల్లో రూ. 590 కోట్లు, లో 20 లక్షల ఖాతాల్లో రూ. 470 కోట్లు.. కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంకుల్లోనూ పెద్ద మొత్తంలో డబ్బు ఉంది. ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐలో కూడా అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు లక్షల్లో ఉండటం గమనార్హం. ఖాతాదారులు లేదా వారి వారసులు తమ పేరుతో ఏ బ్యాంకులో డబ్బు ఉందో తెలుసుకునేందుకు ఆర్బీఐ 'ఉద్గం' అనే పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. పేరు, పాన్ నంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు నమోదు చేస్తే, క్షణాల్లో ఖాతా వివరాలు కనిపిస్తాయి. ఖాతాదారుడు మరణించి ఉంటే, లీగల్ హెయిర్ సర్టిఫికేట్, మరణ ధృవీకరణ పత్రంతో బ్యాంకును సంప్రదించి డబ్బు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది.డిసెంబర్ 31 చివరి గడువు.బ్యాంకులు రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 13 నుంచి డిసెంబర్ 31 వరకు "వారసుల వేట" పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. ఈలోపు ఖాతాలను పునరుద్ధరించకపోతే, మొత్తాన్ని ఆర్బీఐ డీఈఏఎఫా?తాకు బదిలీ చేస్తారు. డీఈఏఎఫ్‌లోకి వెళ్లిన తర్వాత కూడా క్లెయిమ్ చేయవచ్చు కానీ ప్రక్రియ మరింత క్లిష్టంగా ఉంటుంది.ఇన్‌ఆపరేటివ్ ఖాతాలు ఎందుకు పెరుగుతున్నాయి?పట్టణ ప్రాంతాల్లో వలసలు, ఒకటి కంటే ఎక్కువ ఖాతాలు, చిరునామా మార్పులు, కుటుంబ సభ్యులకు తెలియని ఖాతాలుఇవి అన్నీ అన్‌క్లె యిమ్డ్ సొమ్ము పెరుగుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. దీంతో పాటు బ్యాంకులు అవగాహన కార్యక్రమాలను కూడా వేగవంతం చేశాయి.

# పెళ్లిళ్ల సీజన్‌లో మరోసారి తగ్గిన బంగారం ధరలు




నవంబర్ 24వ తేదీ సోమవారం బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి.24 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.1,25,830 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ. 1,15, 340 పలుకుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.94,370 పలుకుతోంది. ఒక కేజీ వెండి ధర రూ. 1,71,900 పలుకుతోంది. నిన్నటితో పోల్చి చూస్తే నేడు బంగారం ధర భారీగా తగ్గింది. పసిడి ధరల హెచ్చుతగ్గులకు అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితులే ప్రధాన కారణం. కానీ, గత కొన్ని నెలలతో పోల్చి చూసుకుంటే.. బంగారం ధర మళ్ళీ తగుముఖం పట్టడం సామాన్యులకు కాస్త ఊరట నిచ్చే అంశం. ఎందుకంటే..ఈ సంవత్సరం ప్రారంభం నుంచి గోల్డ్ ధర దాదాపు 50 శాతం పైన పెరిగి ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. దేశంలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లో ఇవాళ్టి బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ చూద్దాం చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,26,887 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,16,290 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,71,900 లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,830, 22 క్యారెట్ల ధర రూ.1,15,340 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,63,900 లుగా ఉంది.షుగర్‌ని కూకటి వేళ్ళతో తొలగించే పురాతన శివాలయం..! ఎక్కడంటే.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,25,980, 22 క్యారెట్ల ధర రూ.1,15,490 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,63,900 లుగా ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,840, 22 క్యారెట్ల ధర రూ.1,15,350 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,71,900 లుగా ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,830, 22 క్యారెట్ల ధర రూ.1,15,340 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,71,900 లుగా ఉంది.విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,830, 22 క్యారెట్ల ధర రూ.1,15,340 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,71,900 లుగా ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,830, 22 క్యారెట్ల ధర రూ.1,15,340 గా ఉంది. కిలో వెండి ధర రూ.1,71,900 లుగా ఉంది.కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.ఇకపోతే, ఇక్కడ పేర్కొన్న బంగారం ధరలు ఉదయం 8 గంటలలోపు అందిన సమాచారం మేరకు మాత్రమే. ధరలు ప్రతి క్షణం మారవచ్చు. అందువల్ల బంగారం కొనుగోలుదారులు ఇచ్చిన సమయంలో ప్రత్యక్ష ధరలను ట్రాక్ చేయాలి. ఇక్కడ పేర్కొన్న ధరలు నిన్నటి ముగింపు ధరలు అయితే, నేటి ధర తగ్గుదలతో లేదా పెరుగుదలతో ప్రారంభమవుతుంది.

# ఆసియా కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఊచకోత



ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025 టోర్నమెంట్ విజేతగా పాకిస్తాన్ షాహీన్స్ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏ జట్టును ఓడించి పాకిస్తాన్ టైటిల్‌ను గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ యువ ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతంగా ఉంది. వారిలో ఓపెనర్ మాజ్ సదాకత్ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే ఒక ప్రత్యేకమైన విభాగంలో మాత్రం మాజ్ సదాకత్.. భారత్‌కు చెందిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశి కంటే వెనుకబడిపోయాడు.పాకిస్తాన్‌కు చెందిన ఓపెనర్ మాజ్ సదాకత్ టోర్నమెంట్‌లో అత్యంత విజయవంతమైన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతను కేవలం 5 మ్యాచ్‌లలో 129 సగటుతో 258 పరుగులు చేసి పాకిస్తాన్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అయితే అత్యధిక సిక్సర్లు కొట్టిన విషయంలో అందరి చూపు భారత్‌కు చెందిన 14 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశిపై పడింది. మాజ్ సదాకత్ 5 మ్యాచ్‌లలో 19 సిక్సర్లు మాత్రమే కొట్టగలిగాడు. కానీ, వైభవ్ సూర్యవంశి ఒక మ్యాచ్ తక్కువ ఆడి (4 మ్యాచ్‌లలో) ఏకంగా 22 ఆకాశాన్ని అంటే సిక్సర్లు కొట్టి ఈ విషయంలో నంబర్-1 స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన హబీబూర్ రెహమాన్ 21 సిక్సర్లతో మూడో స్థానంలో ఉన్నాడు.ఈ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 టోర్నమెంట్‌లో ఇండియా ఏ జట్టు సెమీఫైనల్‌లోనే నిష్క్రమించినప్పటికీ, వైభవ్ సూర్యవంశి తనదైన ముద్ర వేశాడు. టోర్నమెంట్‌లో అతను కేవలం 4 ఇన్నింగ్స్‌లలో 239 పరుగులు చేశాడు. వైభవ్ ఈ పరుగులను 243.87 అనే భారీ స్ట్రైక్ రేట్‌తో సాధించడం విశేషం. అంతేకాదు టోర్నమెంట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా వైభవ్ పేరిటే ఉంది. యూఏఈ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో అతను కేవలం 42 బంతుల్లో 144 పరుగుల తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ప్రదర్శన అతన్ని భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఒక పవర్ఫుల్ ఆటగాడిగా నిలుస్తుందని నిరూపించింది.

# ఇల్లు కొంటున్నారా. అయితే 5 వార్షిక ఆదాయ నియమాన్ని తెలుసుకోండి



చాలా మందికి మొదటి ఇల్లు కొనడం, కట్టుకోవడం ఒక పెద్ద కల. దాన్ని తీర్చుకున్న పుడు వారి కళ్లలో సంతోషాన్ని కొలవలేం. అయితే ఇల్లు కొనడం అనేది ఎవరి జీవితం లోనైనా ఒక పెద్ద నిర్ణయం. ప్రస్తుతం నగరాల్లో చాలా మంది ఇల్లు కొనేందుకు హోమ్ లోన్స్‌పై ఆధారపడుతున్నారు. నెలనెలా ఈఎంఐ కట్టుకోవచ్చనే ధైర్యంతో లక్షలకు లక్షలు లోన్లు తీసుకొని తమ సొంతింటి కలను నిజం చేసుకుంటున్నారు. అయితే కొంతమంది సరైన ఆలోచన లేకుండా ఈఎంఐ అనే ఉచ్చులో చిక్కుకుంటున్నారు. అలా చిక్కుకోకుండా ఉండాలంటే చాలా తెలివిగా వ్యవహరించాలి. మొదటిసారి హోమ్ లోన్ తీసుకునేవారు కచ్చితంగా 5ఎక్స్ వార్షిక ఆదాయం అనే నియమం గురించి తెలుసుకోవాలి. ఆస్తి విలువ ఆదర్శంగా ఇంటి వార్షిక ఆదాయం కంటే ఐదు రెట్లు మించకూడదు. అంతకు మించి సాగదీయడం మొదట్లో బాగానే ఉన్నా, తరువాత తిరిగి చెల్లించే ఒత్తిడిని సృష్టిస్తుంది. ముఖ్యంగా పెరుగుతున్న రేటు వాతావరణంలో. ఫ్లాట్ లేదా ఇంటి ప్రధాన ధర ఖర్చులో ఒక భాగం మాత్రమే. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ, నిర్మాణంలో ఉన్న ఆస్తుల విషయంలో %+రా%, ప్రాథమిక ఇంటీరియ్‌ర్స్, నిర్వహణ డిపాజిట్లు, బీమా కూడా సాధారణంగా మొత్తం చెల్లింపుకు మరో 8%-%10 శాతం జోడిస్తాయి. ఈ అంశాలను ప్రారంభం నుండే పరిగణనలోకి తీసుకోవాలి. లేకపోతే ఆర్థిక ఒత్తిడి రుణం మంజూరుకు ముందు కాదు, తర్వాత ఉంటుంది. మొదటిసారి కొనుగోలు చేసే చాలా మంది వ్యక్తులు పడే మరొక ఉచ్చు ఓవర్-లివరేజ్. బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఆదాయం ఆధారంగా అధిక రుణ అర్హతను అందించినప్పటికీ, నెలవారీ గృహ బడ్జెట్‌ను అధిగమించకూడదు. ఆదర్శవంతంగా అవుట్‌ఫ్లో మొత్తం నెలవారీ ఆదాయంలో 40%-%45 శాతం మించకూడదు. ఆ పరిధి ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. స్టెప్-అప్ లేదా పార్ట్-ప్రీపేమెంట్ వంటి నిర్మాణాత్మక తిరిగి చెల్లింపు ఉత్పత్తులు నగదు మరింత సౌకర్యవంతంగా నిర్వహించడంలో సహాయపడతాయి.

# జో రూట్ లెక్క వేరే లెవల్ టెస్టుల్లో 6000 రన్స్



ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో పరుగులు చేసే విధానం మరింత ఆసక్తికరంగా మారింది. క్లిష్టమైన పిచ్‌లు, బలమైన బౌలింగ్‌ను ఎదుర్కొని నిలబడిన దిగ్గజ బ్యాట్స్‌మెన్‌లలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ అగ్రస్థానంలో ఉన్నారు. రూట్ 2019 నుంచి 2025 మధ్య ఆడిన 70 మ్యాచ్‌లలో ఏకంగా 6088 పరుగులు చేసి డబ్ల్యూటీసీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచారు. సుమారు 52 సగటుతో, 21 సెంచరీలు, 22 హాఫ్ శతకాలతో రూట్ అద్భుతమైన ప్రదర్శన చేశారు. 262 పరుగుల అతని అత్యధిక స్కోరు, ఎక్కువ కాలం క్రీజులో నిలబడి ప్రత్యర్థిని అలసిపోయేలా చేసే అతని సామర్థ్యానికి నిదర్శనం.టాప్ 5లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఆధిపత్యం డబ్ల్యూటీసీలో అత్యధిక పరుగులు చేసిన టాప్ 5 ఆటగాళ్ల జాబితాను పరిశీలిస్తే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. టాప్ 5 జాబితాలో ముగ్గురు ఆస్ట్రేలియా ఆటగాళ్లు, ఇద్దరు ఇంగ్లండ్ ఆటగాళ్లు ఉండగా, ఈ జాబితాలో భారత్ నుంచి ఒక్క ఆటగాడు కూడా లేకపోవడం గమనార్హం. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పరుగులు చేసిన మొదటి ఐదుగురు ఆటగాళ్ల వివరాలు ఇలా ఉన్నా యి.జో రూట్ (ఇంగ్లాండ్): రూట్ 2019 నుంచి 2025 మధ్య ఆడిన 70 మ్యాచ్‌లలో 6088 పరుగులు చేసి అగ్రస్థానంలో ఉన్నాడు. 52 సగటు, 21 సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలతో పాటు, 262 పరుగుల అత్యధిక స్కోరుతో రూట్ నిలడకు మారుపేరుగా నిలిచాడు.స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా దిగ్గజం స్టీవ్ స్మిత్ 56 మ్యాచ్‌లలో 4297 పరుగులు చేసి రెండో స్థానంలో ఉన్నాడు. 50 సగటుతో, 13 సెంచరీలు, 19 హాఫ్ సెంచరీలతో, 211 పరుగుల అత్యధిక స్కోరుతో రూట్‌కు గట్టి పోటీ ఇస్తున్నాడు.మార్నస్ లబుషేన్ (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియాకే చెందిన మార్నస్ లబుషేన్ 4285 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. 48 సగటుతో 98 ఇన్నింగ్స్‌లలో పరుగులు చేసిన లబుషేన్, 215 పరుగుల పెద్ద ఇన్నింగ్స్, 23 హాఫ్ సెంచరీలతో తనేంటో నిరూపించుకున్నాడు.బెన్ స్టోక్స్ (ఇంగ్లాండ్): ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 3624 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నాడు. 105 ఇన్నింగ్స్‌లలో 8 సెంచరీలు, 17 హాఫ్ సెంచరీలతో స్టోక్స్ దూకుడుతో ఆడుతూ మ్యాచ్‌లను మలుపు తిప్పే సామర్థ్యాన్ని ప్రదర్శించాడు.ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్ 3444 పరుగులతో ఐదో స్థానంలో ఉన్నాడు. 73 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేయడం ఇతని ప్రత్యేకత. ఇతని దూకుడుతో కూడిన బ్యాటింగ్ ఆస్ట్రేలియాకు అనేక మ్యాచ్‌లలో బలం చేకూర్చింది.భారత ఆటగాళ్ల పరిస్థితి ఏంటి?ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్ 5 జాబితాలో భారత ఆటగాళ్లు ఎవరూ లేకపోవడం భారత అభిమానులకు ఆశ్చర్యం కలిగించే అంశం. టెస్ట్ క్రికెట్‌లో భారత్ బలంగా ఉన్నప్పటికీ, ఆటగాళ్లు నిలకడగా ఎక్కువ పరుగులు చేయడంలో ఆసీస్, ఇంగ్లండ్ ఆటగాళ్ల కంటే కాస్త వెనుకబడి ఉన్నారు. భారత బ్యాట్స్‌మెన్‌లు తమ స్థానాలను మెరుగుపరు చుకొని, భవిష్యత్తులో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవాలని భారత అభిమానులు కోరుకుంటున్నారు.

# విడుదలకు ముందే పెద్ది రికార్డులు

## చికిరి చికిరి పాటకు వందమిలియన్ వ్యూస్



విడుదలకు ముందే రికార్డులను తన ఖాతాలో వేసుకుంటోంది 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దానికి కారణం ఇటీవల విడుదలైన 'చికిరి చికిరి' పాటనే. ఈ పాట రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. 16 రోజుల్లో అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల వ్యూస్‌ను (10 కోట్ల వ్యూస్) సొంతం చేసుకున్నట్లు టీమ్ తాజాగా తెలిపింది. దీంతో రామ్‌చరణ్ అభిమానులు సంబరపడుతున్నారు. మరోవైపు ఈ పాటలోని హుక్‌స్టెప్ కూడా బాగా వైరలవుతోంది. దీన్ని ఏకంగా సోషల్ మీడియాలో 5 లక్షల మందికి పైగా రీక్రియేట్ చేసినట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లో కలిపి ఇంతమంది దీన్ని రీల్స్ చేసినట్లు వెల్లడించింది. అలాగే హీరో నితిన్ కుమారుడు కూడా ఈ పాటకు చేతులు కదుపుతూ ఎంజాయ్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. చికిరి చికిరి... అంటూ సాగే ఈ సాంగ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచగా, మోహిత్ చౌహాన్ ఆలపించారు. బాలాజీ సాహిత్యం అందించారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియ్యమ్మగా కనిపించనున్నారు.

# మోక్షు డెబ్యూ.. హీరోయిన్ ఫిక్సా?




నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తేజ.. టాలీవుడ్ ఎంట్రీ కోసం అటు సినీ ప్రియులు.. ఇటు అభిమానులు ఎంతో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిగో.. అదిగో అంటూ కొన్నేళ్లు గడిచిపోయాయి. ఆ తర్వాత గత ఏడాది మోక్షు బర్త్ డే నాడు.. టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మతో డెబ్యూ మూవీ ఉంటుందని ప్రకటించారు.

కానీ ఆ సినిమా కార్యరూపం దాల్చలేదు. రద్దు కూడా అయినట్లే. దీంతో మోక్షు డెబ్యూ డైరెక్టర్ ఆయనే.. ఈయనే అంటూ ఇటీవల రకరకాల వార్తలు వచ్చాయి. రీసెంట్ గా బాలయ్య.. తన కుమారుడు ఎంట్రీ గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఇఫీ వేడుకల్లో.. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ ఆదిత్య 369కి సీక్వెల్ తో మోక్షజ్ఞ ఎంట్రీ ఇస్తాడని క్లారిటీ ఇచ్చారు.ఆదిత్య 369లో నటించి సూపర్ హిట్ అందుకున్న బాలయ్య.. ఇప్పుడు ఆయన కొడుకు ఆ మూవీ సీక్వెల్ తో హీరోగా పరిచయం చేయనున్నారు. క్రిష్ జాగర్లమూడి మోక్షు డెబ్యూకు దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని.. త్వరలో అధికారికంగా ప్రాజెక్టు అనౌన్స్మెంట్ ఇవ్వనున్నారని సమాచారం. అయితే ఇప్పుడు మోక్షజ్ఞ డెబ్యూ మూవీ హీరోయిన్ గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఫిమేల్ లీడ్ ను ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ యంగ్ హీరోయిన్ రాషా తడానీ.. మోక్షు సరసన నటించనుందని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. అందులో నిజమెంతో తెలియకపోయినా.. వార్తలు మాత్రం వినిపిస్తున్నాయి.కాగా.. సీనియర్ బ్యూటీ రవీనా టాండన్, అనిల్ తడానీ కుమార్తె అయిన రాషా ఇప్పటికే బాలీవుడ్ లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆమె చేసిన ఉయ్యమ్మ సాంగ్ ఫుల్ వైరల్ గా మారి అందరినీ ఆకట్టుకుంది. మంచి క్రేజ్ కూడా తెచ్చిపెట్టింది. ఇప్పుడు బాలయ్య కుమారుడి డెబ్యూ మూవీలో హీరోయిన్ గా నటించనుందని ప్రచారం జరుగుతోంది.అయితే ఇటీవల ఆమె టాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్టు అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. ఘట్టమనేని వారసుడు, దివంగత కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఫస్ట్ మూవీలో హీరోయిన్ రోల్ కు రాషానే సెలెక్ట్ చేశారు. రీసెంట్ గా అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు మోక్షు డెబ్యూ మేకర్స్ కూడా రివీల్ చేస్తారని తెలుస్తోంది. మరి చూడాలి అందులో ఎంతవరకు నిజముందో.



రాషా తడానీ

# కెవిఎన్ ప్రొడక్షన్‌లో రావిపూడి




ఈతరం దర్శకుల్లో దర్శకుడు అనిల్ రావిపూడి వినోదం ప్రధానంగా ఆయన సినిమాలుంటాయి. ఈ ఏడాది సంక్రాంతికి వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు. వచ్చే ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తాజాగా ఆయన గురించి ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతుంది. దక్షిణాదిలో భారీ సినిమాలు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమే అన్నట్లు ఆదివారం అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టడంతో ఈ కాంబోలో సినిమా ఖాయమని క్లియర్ అయింది. అయితే ఇందులో హీరో ఎవరు? అనే వివరాలు వెల్లడించలేదు. ఇదే బ్యానర్‌లో చిరంజీవి – బాబీ కొల్లి సినిమా, యష్, విజయ్ ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పవన్‌కల్యాణ్, లోకేశ్ కనకరాజ్ కాంబోలో కూడా ఓ సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది.

# ఫిబ్రవరి 13న స్వయంభు

హీరో నిఖిల్ సిద్ధార్థ అభిమానుల నిరీక్షణకు చిత్ర బృందం తెరదించింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

కొంతకాలంగా ఈ సినిమా నుంచి ఎలాంటి అప్‌డేట్ రాకపోవడంతో ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.విడుదల తేదీ ప్రకటన సందర్భంగా 'రైజ్ ఆఫ్ స్వయంభు' పేరుతో ఓ ప్రత్యేక వీడియోను కూడా రిలీజ్ చేశారు. ఇందులో యుద్ధ సన్నివేశాలు, భారీ సెట్టింగులు, నిఖిల్ వారియర్ లుక్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. మొత్తం మీద ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఇక, ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని చిత్ర బృందం వెల్లడించింది. త్వరలోనే ప్రమోషన్లు పెద్ద ఎత్తున ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన నిఖిల్, ఈ చిత్రంతో పాన్ వరల్డ్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో కలిపి మొత్తం 8 భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. 'బాహుబలి' ఫేమ్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం 'ఈతా'లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. 'పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను' అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో 'ఈతా' తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశారు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.



# జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు డైరెక్టర్ మారుతి క్షమాపణ

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా ఈవెంట్‌లో తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన వివాదంపై దర్శకుడు మారుతి స్పందించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు ఆయన క్షమాపణలు తెలిపారు. ఎవరినీ అగౌరవపరిచే ఉద్దేశం తనకు లేదని, తన మాటలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే చింతిస్తున్నానని పేర్కొన్నారు.హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్ లాంఛ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. 'ఈ సినిమా తర్వాత కాలర్ ఎగరేసుకుంటారు లాంటి మాటలు నేను చెప్పను. ప్రభాస్ లాంటి కటౌట్‌కు అవి చాలా చిన్న మాటలు' అని అన్నారు. ఈ వ్యాఖ్యలు 'కాలర్ ఎగరేయడం' అనే పదం తమ హీరోకు చెందిందని భావించిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు ఆగ్రహం తెప్పించాయి. దీంతో సోషల్ మీడియాలో మారుతిపై ట్రోలింగ్ మొదలైంది.ఈ వ్యవహారం ప్రభాస్, ఎన్టీఆర్ అభిమానుల మధ్య మాటల యుద్ధానికి దారితీయడంతో మారుతి వివరణ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "ఎన్టీఆర్ గారి ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం నా

# సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్న నవీన్ పోలిశెట్టి?



యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా


Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com